**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :62 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | శనివారం 25 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## లద్దాఖ్, కశ్మీర్‌లో చైనా అక్రమ ప్రాజెక్టులపై భారత్ సీరియస్

- పాక్ సింధు జలాల ఒప్పందంపైనా కీలక ప్రకటన
- జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లో చైనా ఆక్రమణలపై భారత్ ఆగ్రహం
- సరిహద్దుల్లో శాంతితోనే ద్వైపాక్షిక సంబంధాలు బలపడుతాయని ప్రకటన
- సింధు జలాల ఒప్పందం అమలుపైనా కీలక వ్యాఖ్యలు



## లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లపై చర్చ
- 2024 ప్రవేశ పరీక్షల అక్రమ పద్ధతుల నివారణ చట్టంలో కీలక సవరణలకు సిద్ధం
- దోషులకు కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశాలు



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?

- స్పష్టం చేసిన ప్రభుత్వ వర్గాలు!
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సుముఖంగా లేని కేంద్రం
- నీట్ లీక్ వివాదంలో ప్రధాన్ రాజీనామాకు పట్టుబడుతున్న సీజేపీ
- నష్టపరిహారం, కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం

# భవిష్యత్తులో పిల్లలే ఆస్తి

- వారు ప్రయోజకులైతే ఊహించని ఫలితాలు
- పిల్లలు పుడితే భారం కాదు ఆదాయంగా మార్చేశాం
- ఎంతమంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం డబ్బులు జమ చేస్తున్నాం
- మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- "ఆర్థిక అసమానతలు తగ్గించాలని ధ్యేయంగా పెట్టుకున్నాం



అమరావతి

మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సంస్కరణలు వచ్చి తీరతాయన్న విశ్వాసం బలపడిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లో మంత్రి లోకేశ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. మెగా్రావీ ఒక అద్భుతమైన కార్యక్రమ మన్న ఆయన ఇవాళ తానూ ఓ విద్యార్థిలా, టీచర్‌లా, మెంటార్‌లా మారే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం

వివరాలు 2లో..



## రూ.1,264 కోట్ల ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- బళ్లారి-గుంతకల్లు మధ్య రెండు కొత్త రైల్వే లైన్లు
- కొత్తగా మూడో, నాలుగో లైన్లు
- బళ్లారి-గుంతకల్లు మధ్య 3, 4వ రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- రూ.1,264 కోట్లతో 46 కిలోమీటర్ల మేర నూతన మార్గాల నిర్మాణం
- ఏపీ, కర్ణాటక రాష్ట్రాలకు ప్రయోజనం

అమరావతి

ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య రైల్వే అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కర్ణాటకలోని బళ్లారి, ఏపీలోని గుంతకల్లు (అనంతపురం జిల్లా) జంక్షన్ల మధ్య అదనంగా రెండు కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం (క్యాబినెట్) ఆమోద ముద్ర వేసినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అధికారికంగా వెల్లడించారు. ప్రస్తుతం బళ్లారి - గుంతకల్లు మార్గంలో రైళ్ల రాకపోకల

వివరాలు 2లో..

## పార్వతీపురానికి కుంకీ ఏనుగుల తరలింపు

- మంగళగిరి వద్ద స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- కుంకీలకు స్వయంగా ఆహారం అందించిన పవన్ కళ్యాణ్



రంపచోడవరం

పార్వతీపురం మన్యం జిల్లాలో మానవ--ఏనుగు సంఘర్షణల నివారణ చర్యలను బలోపేతం చేసే దిశగా పలమనేరు ముసలమడుగు ఏనుగుల శిబిరం నుంచి గుచ్చిమి ఏనుగుల శిబిరానికి తరలిస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. గజరాజులకు మార్గమధ్యంలో పూలు చల్లి స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి, వాటికి స్వయంగా ఆహారం అందజేశారు. అనంతరం

వివరాలు 2లో..



## విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా?

- యూనివర్సిటీలపై రాహుల్ ఫైర్
- విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని రాహుల్ ప్రశ్న
- ఇది ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నమని వెల్లడి

## ఎర్రచందనం మాఫియా మూలాలకు చెక్ పెట్టాలి

- డ్రోన్, ఆధునిక సాంకేతికతతో నిఘా పెంచాలి'
- రెండేళ్లలో 35.6 మెట్రిక్ టన్నులు స్వాధీనం
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలి
- అటవీశాఖ సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. డ్రోన్‌లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిఘాను పటిష్టం చేయాలని, జీరో-టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని ఆయన వారికి సూచించారు. గత రెండేళ్లలో 506 కేసులు నమోదు చేయగా, 1,239 మందిని అరెస్టు చేశామని, 35.6 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. ఈ అక్రమ రవాణా సిండికేట్ల వెనుక ఉన్న సూత్రధారులు, ఆర్థిక సహాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పవన్ సూచించారు. రాష్ట్రంలో ఎర్రచందనం అక్రమ రవాణాను తుడిచిపెట్టే లక్ష్యంతో అటవీశాఖ పని చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారుల్ని ఆదేశించారు. డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికత వినియోగించుకుంటూ నిఘా పటిష్టం చేయాలని మంగళగిరి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమీక్షలో సూచించారు. గడచిన రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు తీసుకున్న చర్యలను అధికారులు వివరించారు. గత రెండేళ్లలో ఎర్రచందనం అక్రమ

వివరాలు 2లో..

## రెండేళ్ల కష్టానికి ఫలితాలు చూస్తున్నాం

- ప్రభుత్వ పాఠశాలల్లో 'నో అడ్మిషన్' బోర్డులు మన విజయం
- ఏడాదిలో గిరిజన ప్రాంత బడులన్నింటికీ సొంత భవనాలు
- మెగా పీటీఎంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్



ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమైతేనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపుతారని, ఈ విషయంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు.

వివరాలు 2లో..

# లద్దాఖ్, కశ్మీర్‌లో చైనా అక్రమ ప్రాజెక్టులపై భారత్ సీరియస్

జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లో చైనా చేపడుతున్న ప్రాజెక్టులపై భారత్ మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాంతాలు భారత భూభాగంలో ఉన్నాయని, అక్కడ చైనా ఏకపక్షంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్ని నిర్మించడం భారత సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించడమేనని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మీడియా సమావేశంలో పలు కీలక అంశాలపై స్పందించారు. ఇటీవల మనీలాలో జరిగిన ఆసియాన్ సదస్సు సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరిగింది. ఈ భేటీకి సంబంధించి చైనా విడుదల చేసిన ప్రకటన వివాదాస్పదమైంది. తైవాన్, టిబెట్ అంశాల్లో చైనా సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తామని జైశంకర్ హామీ ఇచ్చారని ప్రకటనలో పేర్కొంది. దీనిపైనే ఇప్పుడు భారత్ తీవ్రంగా స్పందించింది. జైశంకర్ అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, చైనా చేసిన వాదనలు అసత్యాలేనని ఖండించారు.

'సార్వభౌమాధికారానికి సంబంధించిన విషయాల్లో ప్రశ్నలు లేవనెత్తాల్సింది భారత్. ఇంకా భారత్ ఎప్పుడూ చైనా సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించలేదు. కానీ 1963 నుంచి జమ్ముకశ్మీర్, లద్దాఖ్‌లోని భారత భూభాగాల్ని చైనా అక్రమంగా ఆక్రమించి ఉంది. భారత భూభాగాల్లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తోంది.' అని జైస్వాల్ అన్నారు. జమ్ముకశ్మీర్‌కు చెందిన భూభాగంలో చైనా చేపడుతున్న ప్రాజెక్టుల్ని కూడా భారత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

భారత్ ప్రధానంగా పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ గుండా వెళు న్న చైనా పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌తో పాటు షక్స్‌గామ్ లోయలో చైనా కార్యకలాపాలపైనా ఎప్పటినుంచో



అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇక మనీలా సమావేశంలో జైశంకర్, భారత్- చైనా సంబంధాలు సాధారణ స్థితికి రావాలంటే సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, ప్రశాంతత తప్పనిసరి అని స్పష్టం చేశారు.

### సింధు జలాల ఒప్పందం- మరోసారి పాకిస్థాన్‌కు తేల్చిచెప్పిన భారత్

ఇక పాకిస్థాన్ ఉగ్రవాదానికి శాశ్వతంగా, అందరికీ నమ్మకం కలిగేలా స్వస్తి చెప్పే వరకు సింధు జలాల ఒప్పందం అమల్లోకి రాదని కేంద్ర విదేశాంగ శాఖ మరోసారి స్పష్టం చేసింది. సింధు జలాల ఒప్పందంపై భారత్ వైఖరి అదే విధంగా స్పష్టంగా ఉందని రణధీర్ జైస్వాల్ తెలిపారు. 'పాకిస్థాన్ సరిహద్దు బయట జరిగే ఉగ్రవాదానికి తిరుగులేని, విశ్వసనీయ ముగింపు పలికే వరకు సింధు జలాల ఒప్పందం అమల్లోకి రాదు.' అని స్పష్టం చేశారు. ఆసియాన్ సమావేశంలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ కశ్మీర్ అంశంతో పాటు ×బె విషయాన్ని ప్రస్తావించిన నేపథ్యంలో భారత్ ఈ వివరణ ఇచ్చింది. ఆసియాన్ వేదికను పాకిస్థాన్ రాజకీయ ఆరోపణలకు ఉపయోగించుకుంటోందని జైస్వాల్ విమర్శించారు.

### చీనాబ్ వరదలపై పాక్ ఆరోపణలు నిరాధారం

ఇదే సమయంలో చీనాబ్ నదిలో వరదల్ని భారత్ కావాలనే సృష్టించిందన్న పాకిస్థాన్ మీడియా కథనాల్ని కూడా విదేశాంగ శాఖ ఖండించింది. జులై 20 నుంచి 23 మధ్య జమ్మూ పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగానే చీనాబ్ నదిలో నీటి ప్రవాహం పెరిగిందని జైస్వాల్ వివరించారు. పాకిస్థాన్ అధికారిక వరద అంచనా నివేదికల్లో కూడా ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్లే చీనాబ్ నదిలో నీటి ప్రవాహం పెరిగిందని పేర్కొన్నట్లు వీజూా తెలిపింది. అందువల్ల ఈ వరదల్ని భారత్‌తో ముడిపెట్టడం వాస్తవాలకు విరుద్ధమని తేల్చిచెప్పింది.

భారత్ ముందస్తు వరద హెచ్చరికలు ఇవ్వలేదన్న ఆరోపణల్ని కూడా కేంద్రం కొట్టిపారేసింది. ఆ సమయంలో నదీ ప్రవాహం ప్రత్యేక హెచ్చరికలు జారీ చేయాల్సిన స్థాయికి చేరలేదని తెలిపింది. గతేడాది మాదిరిగానే అవసరం ఏర్పడితే మానవతా దృక్పథంతో దౌత్య మార్గాల ద్వారా వరదలకు సంబంధించిన సమాచారాన్ని పాకిస్థాన్‌తో పంచుకుంటామని జైస్వాల్ వెల్లడించారు.

### రాష్ట్రపతి రొమేనియా పర్యటనపై

జులై 23- 25 తేదీల్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రొమేనియా పర్యటనపై కూడా ఇదే మీడియా సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. భారత్- యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడం భారత్- రొమేనియా వాణిజ్య సంబంధాల్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొంది. ట్రేడ్, టెక్నాలజీ, టూరిజం అలాగే టాలెంట్.. వీటికి సంబంధించి రెండు దేశాల మధ్య సహకారం మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయని తెలిపింది.

# లీక్‌లకు చెక్ పెట్టే బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రశ్నపత్రాల లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు దీర్ఘకాల జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీక్‌లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన



చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాలు ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలో మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# 'విద్యార్థులను హెచ్చరించే ధైర్యమా?

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనలకు దూరంగా ఉండాలని పలు విశ్వవిద్యాలయాలు విద్యార్థులను హెచ్చరించడంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించడం విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, ఆందోళనల్లో పాల్గొనవద్దని విద్యార్థులను హెచ్చరించడానికి విశ్వవిద్యాలయాలకు ఎంత ధైర్యమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే ప్రయత్నాలు సరికావని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న విద్యాసంస్థలు తగిన సమయంలో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సి వస్తుందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే నిరసనల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చని పేర్కొంటూ డీయూ, జేఎన్‌యూ, ఐఐటీలు విద్యార్థులకు ముందస్తు సూచనలు చేశాయి. అలాగే నిరసనలకు సంబంధించిన పోస్టులు, వీడియోలు లేదా ప్రచార విషయాలను సోషల్ మీడియాలో పంచుకోవద్దని కూడా పేర్కొన్నాయి. విద్యార్థుల భద్రత దృష్ట్యా, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే ఈ సూచనలు జారీ చేసినట్లు విద్యాసంస్థలు వెల్లడించాయి.

అలాగే పేపర్ లీక్ అంశంపై పార్లమెంట్?లో చర్చించడానికి ప్రతిపక్షం సిద్ధంగా ఉందని, అయితే ఎలాంటి చర్చలకైనా ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?ను తొలగించాలని డిమాండ్? చేస్తున్నట్లు రాహుల్? గాంధీ తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ రిజిజు ఈ విషయంపై చర్చించడానికి ఎంపీలను ఆహ్వానించారని, అయితే తాను మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు? ఆయన స్పందించలేదని రాహుల్? ఆరోపించారు. నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్? స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు.

"ఇప్పుడే మన ఎంపీలతో చర్చ జరగాలని చెప్పాలనుకుంటున్నట్లు మంత్రి రిజిజు ఒక ప్రకటన చేశారు. సాధారణ నియమావళి ప్రకారం ఎవరైనా మరొకరి పేరు ప్రస్తావిస్తే, వారికి ప్రతిస్పందించాలి. నేను అలా



స్పందించాలనుకున్నపుడు నీ మైక్?ను లాగేసుకున్నారు. నాకు ఆ అవకాశం ఇవ్వలేదు."

నిరసన చేస్తున్న విద్యార్థులకు మూడు ప్రధాన డిమాండ్లు ఉన్నాయని, ఆ డిమాండ్లన పరిష్కరించే వరకు ప్రతిపక్షం చప్పుల్లో పాల్గొనబోదని రాహుల్? స్పష్టం చేశారు. అందులో మొదటిది విద్యాశాఖ మంత్రిని తొలగించడం, రెండోది విద్యార్థులపై దాడి చేసి, వారిని కొట్టిన వారిపై చర్య తీసుకోవాలని, మూడోది ప్రధాని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి అని అన్నారు.

జంతర్‌మంతర్ వద్ద ఆందోళనల్లో పాల్గొన్న నిరసనకారులపై పెల్లెట్‌గన్ ప్రయోగించారన్న ఆరోపణలను దిల్లీ పోలీసులు ఖండించారు. అయితే దిల్లీ పోలీసుల ప్రకటనను ఖండించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పెల్లెట్‌గన్ ప్రయోగంలో గాయపడ్డ బాధితుడిని రుజువుగా కెమెరా ముందుకు తీసుకొచ్చారు. పెల్లెట్‌గన్ దాడిలో అతడి కంటికి తీవ్ర గాయమైందని చెప్పుకొచ్చారు. "పెల్లెట్ గన్ ఎప్పుడు తగిలిందో నేను చెప్పాలనుకుంటున్నాను. నా సోదరులు భారతదేశ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని శాంతియుతంగా నిరసన తెలుపుతున్నప్పుడు ఈ పెల్లెట్ గన్లు ప్రయోగించారు. ప్రభుత్వం ఏమో అసలు ఏ పెల్లెట్ గన్ ఉపయోగించలేదని చెప్తోంది. అవునా? ఇదిగో చూడండి, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. దీన్ని, దీన్ని పెల్లెట్ గన్ అంటారు. సరేనా? ఇతని కన్ను దెబ్బతింది. కంటిచూపు సరిగ్గా కనిపించడం లేదు. వీళు మన దేశ భవిష్యత్తు! అలాంటి వేలాది మంది యువకులపై పెల్లెట్ గన్లు ఉపయోగించారు, లాఠీఛార్జ్ చేశారు, కొట్టారు, హింసించారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

### కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ఖర్గే

అయితే విశ్వవిద్యాలయాల్లో విడుదలైన సర్క్యులర్లపై కాంగ్రెస్ నేతలు, విద్యావేత్తలు, సినీ ప్రముఖులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను విద్యార్థులను బెదిరించే "ప్రచార కేంద్రాలుగా" మార్చేస్తోందని ఆరోపించారు. జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న నిరసనలకు దూరంగా ఉండాలని డీయూ, జేఎన్‌యూ విద్యార్థులకు సలహాలు ఇవ్వడం దీనికి నిదర్శనమని అన్నారు.

"మోదీ ప్రభుత్వం దేశంలోని అత్యంత గౌరవనీయమైన విశ్వవిద్యాలయాలను విద్యార్థులను బెదిరించడానికి ఉపయోగిస్తోంది. విద్యార్థులు ఎందుకు వీధుల్లోకి వస్తున్నారో దీనివల్లే స్పష్టమవుతోంది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించి, విద్యా వ్యవస్థలో సంస్కరణలపై చర్చ ప్రారంభించాల్సిన ప్రభుత్వం, మోదీ, షా నాయకత్వంలో విద్యా కేంద్రాలనే అవమానిస్తోంది. గత 12 ఏళ్లలో బీజేపీ విద్యా వ్యవస్థను ఎలా దెబ్బతీసిందో ఇప్పుడు దేశ ప్రజలకు అర్థమవుతోంది."

దిల్లీ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా మాట్లాడుతూ, "డీయూ విడుదల చేసిన ఈ ప్రకటనను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. జంతర్‌మంతర్ వద్ద నిరసనలు చట్టవిరుద్ధమని ఎవరు ప్రకటించారు? ఇలాంటి విషయాల్లో తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటు" అని వ్యాఖ్యానించారు. నటి, నిర్మాత పూజా భట్ కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. "విద్యార్థుల గొంతులను అణచివేస్తే వారి భద్రత మరింత ప్రమాదంలో పడుతుంది. వారి భవిష్యత్తుపై నిజంగా ఆందోళన ఉంటే మౌనంగా ఉండకుండా, వారి ప్రజాస్వామ్య హక్కులకు మద్దతు ఇవ్వాలి" అని ఆమె పేర్కొన్నారు.

## జంతర్ మంతర్‌లో అంటువ్యాధుల ముప్పు



దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జులై 20న జరిగిన ఘర్షణల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. ఆ హింసాకాండ ముందస్తు ప్రణాళికతో జరిగిందా లేక ఆకస్మికంగా చెలరేగిందా అని నిర్ధారించడానికి దిల్లీ పోలీసులు వేలాది వీడియోలు, సోషల్ మీడియా ప్రసారాలు, మొబైల్ ఫోన్ రికార్డులను పరిశీలిస్తున్నారని శుక్రవారం వర్గాలు తెలిపాయి. పోలీసు సిబ్బందిపై దాడి చేస్తూ, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారిని గుర్తించడానికి మొబైల్ ఫోన్ రికార్డింగ్‌లు, సీసీటీవీ ఫుటేజ్, లైవ్‌స్ట్రీమ్‌లు, సోషల్ మీడియా కంటెంట్‌ను విశ్లేషిస్తున్నారని వర్గాలు పేర్కొన్నాయి. అలాగే, నిరసనల సమయంలో సోషల్ మీడియాలో లైవ్‌లోకి వెళ్లిన వ్యక్తులను కూడా దర్యాప్తు అధికారులు గుర్తిస్తున్నారని ఓ అధికారి తెలిపారు. ఆ ప్రసారాల ద్వారా హింసలో పాల్గొన్న వ్యక్తుల ఉనికిని కనిపెట్టవచ్చని భావిస్తున్నారు. పోలీసు బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించే ముందు నిరసనకారులు సమన్వయం చేసుకున్నారా లేదా అని నిర్ధారించడానికి, దర్యాప్తు అధికారులు పలువురు అనుమానితుల కాల్ రికార్డ్స్, మొబైల్ టవర్ లొకేషన్లు, కమ్యూనికేషన్ విశ్లేషిస్తున్నారు. ఘర్షణలకు ముందు, తర్వాత సమయంలో అనుమానితుల కదలికలను పోలీసులు గుర్తించనున్నారు. హింసాకాండ జరిగిన సమయంలో పలు ప్రదేశాల్లో ఉన్న మొబైల్ నంబర్లను గుర్తించడానికి, పార్లమెంట్ స్ట్రీట్, జంతర్ మంతర్ దాని పరిసర ప్రాంతాల నుంచి టవర్ డంప్ విశ్లేషణ కూడా జరుగుతున్నట్లు వర్గాలు తెలిపాయి.

## రెండేళ్ల కష్టానికి ఫలితాలు చూస్తున్నాం

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన సంస్కరణల వల్ల రెండేళ్లలో ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు చేరారన్నారు. చరిత్రలో తొలిసారి ప్రభుత్వ పాఠశాలల ఎదుట నో అడ్మిషన్ బోర్డులు చూస్తున్నామన్నారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీట్ (పీటీఎం)లో ఆయన మాట్లాడారు. 'నా నియోజకవర్గం మంగళగిరిలోని నిడమర్రు పాఠశాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేశాం. ఇటీవల ఓ తల్లి తన బిడ్డకు అందులో సీటు ఇప్పించాలని నాతో గొడవపడ్డారంటే ప్రభుత్వ పాఠశాల దశ ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆ తరహాలో లీప్ స్కూల్ ఏర్పాటు చేస్తాం. తల్లికి వందనం ఒక కార్యక్రమం కాదు. మనకు జన్మనిచ్చిన తల్లికి, భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు కృతజ్ఞత చెప్పడం. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు ఇవ్వకపోయినా ఫర్వాలేదు.. మంచి విద్య అందించాలి. పెద్దపెద్ద భవనాలు కట్టలేకపోయినా ఫర్వాలేదు, పెద్ద కలలు కనడం నేర్పించాలి. మేం వచ్చిన తర్వాత వన్ క్లాస్- వన్ టీచర్ విధానం చేపట్టాం. 10 వేల పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ ఉన్నారు. మెగా డీఎస్సీతో 16 వేల పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది మరో 3 వేల పోస్టులు భర్తీ చేయబోతున్నాం. గిరిజన ప్రాంతంలో సొంత భవనాల్లేని 200 ప్రభుత్వ పాఠశాలలకు ఏడాదిలోగా శాశ్వత గూడు కట్టించే బాధ్యత నాది. తొమ్మిదో తరగతిలో క్లికర్ టెక్నాలజీ అమలుచేశాం. ఏ సబ్జెక్ట్‌లో పిల్లలు వెనుకబడి ఉన్నారో మీ ఫోన్‌కు ఆ వివరాలు, వీడియోలు వస్తాయి. పిల్లలు ఇంటికి వచ్చాక వాటిని చూసి హోం వర్క్ చేయించేలా చూస్తాం' అని భరోసా ఇచ్చారు.

మెగా పీటీఎంకు 71 లక్షల మంది హాజరు: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన మెగా పీటీఎంకు 71 లక్షల మంది హాజరైనట్లు సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్ట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. 44,076 పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేంద్రం నో?



నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళనలు ఉద్ధృతం చేసినప్పటికీ, ఆయన రాజీనామాకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా లేదని తెలుస్తోంది. ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. "రాజీనామా చేయడం చాలా తేలికైన నిర్ణయం. కానీ ప్రజలు మాకు అధికారం ఇచ్చింది బాధ్యతలను నిర్వర్తించడానికే తప్ప, పారిపోవడానికి కాదు. మేము వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాలు వెల్లడించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడ్డాయి. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)లో నెలకొన్న వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించడం, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవడంపైనే ప్రస్తుతం ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. శుక్రవారం జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న సీజేపీ విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం రెండో విడత చర్చలు జరిపింది. ప్రభుత్వ ప్రతినిధులుగా కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించడం, శాంతియుత నిరసనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం వంటి అంశాలకు సూత్రప్రాయంగా అంగీకరించిన ప్రభుత్వం, మంత్రి రాజీనామా విషయంలో మాత్రం శనివారం మధ్యాహ్నం వరకు గడువు కోరినట్లు కాక్రోచ్ జనతా పార్టీ తెలిపింది. అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు విరమించే ప్రసక్తే లేదని సీజేపీ నేతలు అశు తోష్ రాంకా, అభిజీత్ దీప్కే తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషిని బదిలీ చేసి, కీలక విభాగాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇతర విద్యా సంబంధిత అంశాలపై సోషల్ మీడియాలో చురుకుగా వ్యవహరిస్తూనే, పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను షేర్ చేస్తున్నారు.

# ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి ఏర్పాట్లు





సాయంత్రం స్వామివారి గిరి ప్రదక్షిణ

**నక్కపల్లి, పెన్ సత్తా, జులై 24:** కలియుగ దైవం ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం ఉమాకా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినానికి భారీ ఏర్పాట్లు చేశారు. గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఆషాడశుద్ధ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు స్వామివారి దర్శనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా టీటీడీ ఆధ్వర్యంలో విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.

దీనిలో భాగంగా ఆలయం గాలిగోపురం వద్ద ఆలయ ప్రాంగణంలోనూ గర్భాలయం వద్ద పెండాల్సు ఏర్పాటు చేశారు. శనివారం తొలి ఏకాదశి సందర్భంగా స్థానికులతో పాటు సుదూర ప్రాంతాల నుండి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున బారికేడ్లు తో క్యూలైన్ లు భక్తులు అందరికీ స్వామివారి ఉచిత ప్రసాదాన్ని అందజేయడానికి గాను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు మాట్లాడుతూ శనివారం తెల్లవారుజామున మూడున్నర గంటలకు గరుడాద్రి పర్వతంపై గల శ్రీ కలికి వెంకటేశ్వర స్వామి వారి మూలవిరాట్ కు విశేష అభిషేక కార్యక్రమాన్ని ఆలయ అర్చక బృందం ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు భక్తులందరకి స్వామివారి దర్శన భాగ్యాన్ని కల్పించనున్నారు.

కొండ దిగువున గల ఆలయ క్షేత్రపాలకుడు నారద మహాముని ప్రతిష్టమైన శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయంలోనూ ఉపాల్యములలోనూ తెల్లవారుజామున నిత్య పూజ కైంకర్యములు నిర్వహించిన తర్వాత భక్తులందరూ రాత్రి 8 గంటల వరకు దర్శన సౌకర్యాన్ని కల్పించనున్నారు.

తొలి ఏకాదశి సయ్యన్న ఏకాదశి సందర్భంగా సాయంత్రం నాలుగున్నర గంటలకు స్థానిక శ్రీనివాస భక్త సమాజం వారి ఆధ్వర్యంలో భక్తుల గోవింద నామస్మరణల మధ్య గిరి ప్రదక్షిణ కార్యక్రమము జరుగుతుందని తెలిపారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రసాద వితరణ చేయనున్నామని ఆయన పేర్కొన్నారు.



# దేశపాత్రునిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో "అభయ" అవగాహన కార్యక్రమం.





**పరవాడ పెన్ సత్తా, జులై 24:** పోలీస్ స్టేషన్ ఎస్ఐ సీహెచ్. భీమరాజు దేశపాత్రునిపాలెం జెడ్పీ హైస్కూల్లో "అభయ" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు మహిళల భద్రత, బాలల హక్కులు, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో 112, 1930 హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగం, అలాగే శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఏవైనా వేధింపులు, సైబర్ మోసాలు లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు కలిపి సుమారు 100 మంది పాల్గొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు చట్టాలపై అవగాహన పెంచుకొని, పిల్లల భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఏ సమస్య ఎదురైనా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

# పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్--టీచర్స్ సమా వేషాలు





### పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలి కొప్పిశెట్టి వెంకటేష్

**నక్కపల్లి పెన్ సత్తా, జులై 24:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహింప తలపెట్టిన మెగా పేరెంట్స్ , టీచర్స్ సమావేశాలు 4.0 మండల కేంద్రం నక్కపల్లి లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ స్కూలు, ప్రాథమిక ఉన్నత పాఠశాల, రెసిడెన్షియల్ స్కూలు, బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రతి స్కూల్ కి వెళ్లి ఘనంగా నిర్వహించారు, కొప్పిశెట్టి వెంకటేశ్ రాక సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ప్రతిపాఠశాల తరగతి గదులను మామిడి తోరణాలతో, సర్వాంగ సుందరంగా పండుగ వాతావరణం ఉట్టి పడేలా అలంకరించారు. కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పిల్లల విద్యాభివృద్ధికి, ఉజ్వల భవిష్యత్తుకు ఈ సమావేశం దోహదపడుతుందని అన్నారు. పిల్లలు జీవితంలో తల్లిదండ్రులే మొదటి గురువులనీ ఉపాధ్యాయులు వారికి క్రమశిక్షణ, నైతిక విలువలు బాధ్యతలు వంటివి నేర్పిస్తారు అన్నారు. పిల్లలు భవిష్యత్తులో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రధాన బాధ్యత వహించాలన్నారు.

ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులతో మమేకం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యారంగంలో అనేక సంస్కరణలుతీసుకొచ్చారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం బలమైన పునాదులు వేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర పురోగతి ఉపాధ్యాయులు, విద్యార్థుల నుంచేప్రారంభమవుతుందని పేర్కొన్న పాఠశాలలు, కళాశాలల ఆవరణలో ఇతర కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గుడిని ఎలా పవిత్రంగా భావిస్తామో, బడిని కూడా అదే విధంగా గౌరవించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి ఫోటోలను పత్రికల్లో ప్రచురిస్తున్నామని చెప్పారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.



"తల్లికి వందనం" వంటి పథకాల ద్వారా కుటుంబాలకు అండగా నిలుస్తున్నామని, ఎన్డీఏ ప్రభుత్వం 16 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసిందని తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు ఏర్పాటు కానుండటంతో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెంకటేష్ తెలిపారు. విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి నిర్మూలనపై ఎన్డీఏ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ హెచ్చరించారు. పిల్లలకు జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా తల్లిదండ్రులు వారిని తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల తల్లిదండ్రులు, ఎంఈఓ కె . నరేష్, ఎండిఓ నక్కపల్లి మండల టిడిపి పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, బిజెపి జిల్లా పార్టీ అధ్యక్షులు కోసూరి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పోల్నాటి నానాజీ, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, వేగి సత్యనారాయణ, నక్కపల్లి టిడిపి టౌన్ అధ్యక్షులు అడ్డూరి లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, కక్కిరాల సురేష్, స్కూల్ చైర్మన్, అడ్డూరి శ్రీను, పెద్దిరెడ్డి రమేష్, కేవీ సత్యనారాయణ, అడ్డూరు నాగభూషణం, బద్రి, కోసూరి శ్రీనివాసరావు, కొల్నాటి నాగేశ్వరరావు, గిడుతూరి బాబ్జి, లంకా సత్తిబాబు, ప్రగడ వీరబాబు, నడిగట్ల రమణ, లతోపాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.







## అక్షరం జీవితానికి తొలి అడుగు,అన్నం జీవనానికి మరో అడుగు.

బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవ్య శ్రీ మహంతి మరియు ఏ జి ఎం ఓ ప్రియా.సుధాకర్.






**ఇచ్ఛాపురం పెన్ సత్తా, జులై 24:** ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్ డే(మెగా పిటిఎం)వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముందుగా కళాశాలకు చేరుకున్న తల్లిదండ్రులకు ఘనంగా స్వాగతం పలికిన విద్యార్థినులు అనంతరం తల్లిదండ్రులకు పాద పూజ చేశారు.తరువాత విద్యార్థులు తల్లిదండ్రులకు ఆటలు పోటీలు నిర్వహించారు.భోజన కార్యక్రమం అనంతరం ప్రిన్సిపాల్ నవ్యశ్రీ.మహంతి,ఏజీఎంఓ ప్రియా.సుధాకర్ మాట్లాడుతూ"అక్షరం జీవితానికి తొలి అడుగు" అని,"అన్నం జీవనానికి మరో అడుగు"అని పేర్కొన్నారు.విద్యార్థులు అందరూ అధ్యాపకులు చెప్పే విషయాలన్నీ శ్రద్ధగా విని ఇష్టపడి మరియు కష్టపడి చదివి కుటుంబానికి మరియు సమాజానికి ఉపయోగపడేలా ఉండేలాగా అని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్.బాపూజీ యుగంధర్,ప్రసాద్,జగదీష్, కరుణాకర్,రజిని,జనార్ధన్, అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.ం

# జూలై 30న కలెక్టరేట్ ధర్నాకు తరలి రండి.

- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి.




**పరవాడ పెన్ సత్తా, జులై 24: .** ఫార్మా కంపెనీలో కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారని కార్మిక చట్టాలు అమలు కావడంలేదని 15 ఏళ్లగా ప్రభుత్వాల అండతో యాజమాన్యాలు కార్మికుల శ్రమనుదోచుకుంటున్నాయని, 2011లో ఫార్మపరిశ్రమల్లో వేతనాలు సవరణ చేసి ఆ తర్వాత 2016,20 21,2026 లో అంటే మూడుసార్లుగా 15 సంవత్సరాలైనా వేతనాల పెంపు జీవో ఇవ్వలేదు. ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వేతనాల పెంపకై ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ ధర్నాలో కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఫార్మసిటీలో కలెక్టర్ కార్యాలయం వద్ద ఈనెల 30 జరిగే ధర్నా పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గని శెట్టి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలలో కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, కుటమి ప్రభుత్వాలు వేతనాలు పెంచకుండా కార్మికులందరికీ నష్టం చేశారు. మూడుసార్లు వేతనాలు పెంచి ఉంటే ఇప్పుడు వచ్చే వేతనాలు కంటే సుమారు పదివేల రూపాయలు ఎక్కువ వచ్చి ఉండేవి. అలాచేయనందున కార్మికులప్రతినెలావేలాదిరూపాయలునష్టపోతున్నారు. ప్రభుత్వ విధానాల వలన విద్య, వైద్యం ,గ్యాస్, పెట్రోల్ ,కరెంట్ చార్జీలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. జీతాలు మాత్రం పాతాళానికి తొక్క వేయబడుతున్నాయన్నారు వెంటనే వేతనాలు పెంపుదాలకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కార్మికుల వేతనాలు పెంచాలని ఈనెల 30న ధర్నా జరుగుతుందని ఈ ధర్నాలో పెద్ద ఎత్తున కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో రమేష్, దేవరాజ్, ఈశ్వరరావు, దేవకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి.

- రిటైర్డ్ ఉద్యోగి పైలా సన్యాసిరావు మాస్టారు.





**పరవాడ పెన్ సత్తా, జులై 24:** విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించి వృద్ధిలోకి రావాలని టిడిపి నాయకులు రిటైర్డ్ ఉపాధ్యాయుల పైలా సన్యాసిరావు మాస్టర్ ఆకాంక్షించారు. శుక్రవారం పరవాడ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు బి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో నిర్వహించిన మెగా పేరెంట్ 4.ఓ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లి తండ్రులు పిల్లలతో స్నేహంగా మెలగుతూ వారిని సక్రమ మార్గంలోనడిపించాలనీ,ఉపాధ్యాయులు తల్లి తండ్రిలు విద్యార్థుల భవిషత్ పట్ల నిర్దిష్టమైన ప్రణాళిక అమలు పరచి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం స్కూల్ మానిటరింగ్ కమిటీ చైర్పర్సన్ శ్రీమతి సిహెచ్ ఉమా మాట్లాడుతూ పిల్లలు ఏం కావాలని అనుకుంటున్నారో నిర్ణయించుకొని తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు భోజన వసతి కల్పించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ మానిటరింగ్ కమిటీ సభులు కూండ్రపు సోము నాయుడు, టిడిపి నాయకులు పైల చిన్న అక్కు నాయుడు,ఉపాధ్యాయి సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు లంకెలపాలెం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం.

**లంకెలపాలెం పెన్ సత్తా, జులై 24:** :అనకాపల్లి జిల్లా, పరవాడ మండలం,లంకేలపాలెం సెక్షన్ పరిధిలోని 33/11 కెవి లంకేలపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి మురళీకృష్ణ శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 09:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు
పెదముషిడివాడ పంచాయతీ,కన్నూరు,మంత్రిపాలెం, టిడ్కో, జెఎన్ఎన్‌యుఆర్ఎం, లంకేలపాలెం - గంగిరెడ్ల కాలనీ, లంకేలపాలెం జంక్షన్, లంకెళపాలెం పాత ఊరు,గంజి పెట, శ్రీరామ్ నగర్ కాలనీ , వినాయకనగర్ కాలనీ , లంకేలపాలెం పారిశ్రామిక ప్రాంతం, గొన్నవనిపాలెం , ఇ మర్రిపాలెం , ఫార్మాసిటీ కాలనీ , లెమర్తి, తాడి, పెధ తాడి, చిన్న తాడి. తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 తర్వాత యధావిధిగా విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు.అందువల్ల వినియోగదారులు తమ విధులకు సహకరించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

## జీవో నెంబర్ 396 రద్దు చేయాలి.

- ఐదో రోజుకు చేరిన దస్తావేజు లేఖరుల పెన్డౌన్ సమ్మె



**నక్కపల్లి పెన్ సత్తా, జులై 24:** :ఆర్ఎస్కే సెంటర్లపై వచ్చిన జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని నిరసన తెలియజేస్తూ దస్తావేజు లేఖరుల పెన్డౌన్ సమ్మె ఐదో రోజుకు చేరింది. ఈ నిరసనకు సంఘీభావం తెలిపిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ మాట్లాడుతూ పిపిపి విధానంలో రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటుపరం చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులతో పాటు దస్తావేజులేఖరుల మనుగడ పూర్తిగా మారిపోతుందని తక్షణం జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని అన్నారు. దస్తావేజు లేఖరుల పెన్డౌన్
నిరసనకు సంఘీభావం తెలిపిన సిపిఎం పార్టీ రైతు విభాగం ఎం అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు చరిత్ర కలిగిన రిజిస్ట్రేషన్ శాఖను పిపిపి విధానం ద్వారా తీసుకువచ్చే ఆర్ ఎస్ కె సెంటర్లు ప్రజల భద్రతకు 3 ఏర్పడుతుందని దస్తావేజులేఖర్ల జీవితం రోడ్డున పడుతుందని తక్షణ ఇటువంటి విధానాన్ని విడనాడి ప్రభుత్వం జీవో నెంబర్ 396ను రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొంగర చిన్నకృష్ణమూర్తి, అధ్యక్షుడు దాతారం మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎన్ వి రమణ, ట్రెజరర్ లోవరత్నం ,జాయింట్ సెక్రటరీ డిఎంపి కుమార్, త్రినాధ్ ,నవీన్ ,ముద్దా బాబ్జి, సాయి తేజ, మదీనా, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితునికి అండ.

వైద్య ఖర్చులకు చేయూత



**కవిటి పెన్ సత్తా, జులై 24:** కవిటి గ్రామానికి చెందిన సదానంద సాహూ(టైలర్) కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ గురయ్యాడు.ఆయన ఆరోగ్య పరిస్థితిని చూసిన స్థానిక మాజీ సర్పంచ్ పాండవ.శేఖర్ మరియు మొర్రి.గోపి ఆధ్వర్యంలో శుక్రవారం రూ.21000/- నగదు సేకరించి మాజీ జడ్పీటీసీ బి.రమేష్, ఉషోదయ యువజన సంఘమాజీ అధ్యక్షులు ఆరంగి.మధు సమక్షంలో ఆ కుటుంబానికి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మొగిలిపురి.సీతారాం,తెప్పల.మోహన్ రావు,బావన.రవి, మొగలిపురి.డిల్లేశ్వరరావు, నెయ్యిల.శ్రీధర్,మొర్రి.గోపి పాల్గొన్నారు.

## మెగా పీటీఎం విద్యారంగంలో చేపడుతున్న ప్రధాన సంస్కరణల్లో ఒక భాగం.






- విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపు.
- మానవత్వమే ఏకైక మతం -- తల్లిదండ్రుల ప్రవర్తనే పిల్లలకు ఆదర్శం.
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరు.
- ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.
- విద్యార్థుల అభివృద్ధికి తల్లిదండ్రులు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలి.

**రావికమతం పెన్ సత్తా, జులై 24:** విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం రావికమతం మండలం, మరుపాక ఏపీ మోడల్ స్కూల్ నందు నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ 4.0 కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు ఖూచీా రాజుతో కలసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ హాజరయ్యారు.

**జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మాట్లాడుతూ.....**

మెగా పీటీఎం విద్యారంగంలో చేపడుతున్న ప్రధాన సంస్కరణల్లో ఒక భాగమన్నారు. తల్లిదండ్రులు వారానికి ఒకసారైనా పాఠశాలకు వచ్చి పిల్లల చదువు, ప్రగతిని పరిశీలించాలని సూచించారు. ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, వారు అనుకున్న లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని కోరారు."తమ జీవితంలో నెరవేరని కలలను పిల్లల ద్వారా నెరవేర్చుకోవాలనే తపన ప్రతి తల్లిలో ఉంటుందని, పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగడమే తల్లిదండ్రులకు నిజమైన సంతోషం" అన్నారు. పిల్లల పెంపకం మరియు వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లులతో పాటు తండ్రుల శ్రమ, పాత్ర కూడా ఎంతో కీలకమైనవని ప్రత్యేకంగా అభినందించారు. తన సొంత విద్యాభ్యాసం మరియు ఉన్నత స్థితికి చేరుకున్న ప్రయాణాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, సరైన చదువు, క్రమశిక్షణ ద్వారా ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని స్పష్టం చేశారు. సాధారణంగా పిల్లలను నీట్‌గా తయారు చేసి పాఠశాలకు పంపడం, వారి హోంవర్క్ చూడటం తల్లులు బాధ్యతగా తీసుకుంటే, సమాజాన్ని ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో తండ్రి పాత్ర ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. సమాజంలో ప్రతీ ఆడపిల్లను తమ సొంత ఇంట్లోని కూతురు, సోదరి లేదా తల్లిగా భావించినప్పుడే సమాజం సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు.మగపిల్లలకు చిన్ననాటి నుంచే మహిళల పట్ల గౌరవం, మర్యాద మరియు నైతిక విలువలు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సూచించారు. ఎదుటివారి లోపాలను ఎత్తిచూపి ద్వేషించడం చాలా తేలికని, కానీ వారి లోపాలను భరిస్తూ ప్రేమించడం, సహనం చూపడమే నిజమైన చదువు అని తెలిపారు. చట్టాలు, పోలీసుల శిక్షల కంటే మన ఊరు, మన పిల్లలు, మన బడి అనే భావన ప్రతి ఒక్కరిలో కలిగినప్పుడే సమాజంలో నేరాలు తగ్గి, శాంతియుత వాతావరణం ఏర్పడుతుందని పిలుపునిచ్చారు. కులం, మతం, లింగం, ధనిక-పేద వ్యత్యాసాలు వంటి విభజన శక్తులను పక్కనబెట్టి, ప్రతీ ఒక్కరూ "మానవత్వమే మన మతం" అనే భావనను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలకు కేవలం ఉపదేశాలు ఇవ్వడం కాకుండా, తల్లిదండ్రులు ఆచరించి చూపడం, వారి కలలకు అండగా నిలవడం ద్వారా తండ్రులు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కష్టాల విలువ తెలిసినప్పుడే పిల్లలు బాధ్యతాయుతంగా ఎదుగుతారని వ్యాఖ్యానించారు.
చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ రాజు మాట్లాడుతూ...

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఏమాత్రం తీసిపోరు.**

ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది.
విద్యార్థుల సౌకర్యాలు, ప్రాంతీయ రోడ్డు వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ చూపిన నిబద్ధతను ప్రత్యేకంగా ప్రశంసించారు. నాలుగు వారాల నియోజకవర్గ పర్యటనలో భాగంగా చోడవరం మోడల్ స్కూల్‌లో హాస్టల్ సదుపాయం లేదని కమిటీ చైర్మన్, ప్రిన్సిపాల్ మరియు స్థానిక నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాగా, వినతిపత్రం స్వీకరించిన వెంటనే కలెక్టర్ ఉన్నతాధికారులతో మాట్లాడి, వాట్సాప్ ద్వారా సమాచారాన్ని పంపి, మోడల్ స్కూల్‌కు త్వరలోనే హాస్టల్ మంజూరయ్యేలా తక్షణ చర్యలు చేపట్టారని కొనియాడారు. రావికమతం నుండి మోడల్ స్కూల్‌కు వచ్చే రహదారి, నాగయ్యపాలెం తారు రోడ్డు మరియు సిమెంట్ రోడ్డు పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. మరో షార్ట్ రూట్ రోడ్డు నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల సౌకర్యార్థం నర్సీపట్నం, విశాఖపట్నం డిపో అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం అందుబాటులోకి తెచ్చామని, రావికమతం నుండి తారబొండ వరకు రోడ్డు నిర్మాణ పనులు కూడా త్వరలోనే పూర్తవుతాయని స్పష్టం చేశారు.రావికమతం మండలంలోని చలిసింగం గిరిజన గ్రామానికి రహదారి లేక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్న విషయం గుర్తించి, స్వయంగా జిల్లా కలెక్టర్ కొండ ప్రాంతమైన ఆ గ్రామాన్ని సందర్శించారు. ఫారెస్ట్ క్లియరెన్స్ సమస్యలను పరిష్కరించి రహదారి మంజూరుకు శ్రమించిన తొలి కలెక్టర్‌గా విజయ కృష్ణన్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి హామీ నిధులతో పాటు ఇతర అభివృద్ధి నిధులను కేటాయించి రహదారుల నిర్మాణాలు, మౌలిక వసతుల పనులను త్వరలోనే శంకుస్థాపన చేసి పూర్తి చేస్తామని వెల్లడించారు. చేలపాడు పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాలకు తారు రోడ్లు, మట్టి రోడ్ల నిర్మాణం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అప్‌గ్రేడ్ అవుతున్నాయని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

**తల్లికి వందనం' ఆర్థిక సాయం జమ**

మోడల్ స్కూల్ ఒక్క పాఠశాల పరిధిలోని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ?92,69,000 జమ చేశామని తెలిపారు. రావికమతం మండల వ్యాప్తంగా 9,400 మంది లబ్ధిదారులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికి ?13,000 చొప్పున మొత్తం ?12 కోట్ల 22 లక్షల రూపాయలు నేరుగా జమ చేసినట్లు స్పష్టం చేశారు.సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా ఖాతాల్లో డబ్బులు పడకపోతే, హెచ్ఎం మరియు ఎంఈఓ (ఎంఈఓ) లకు వివరాలు అందజేయాలని కోరారు. అటువంటి వారి వివరాలతో నివేదిక తయారు చేసి, కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి లబ్ధి చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. మోడల్ స్కూల్ హాస్టల్ మంజూరు విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు.చివరగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముచ్చటించి వారికి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా వడ్డించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావు నాయుడు, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్, మండల స్పెషల్ ఆఫీసర్ ఏ. విజయ్ ప్రకాష్, తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో మహేష్, పాఠశాల కమిటీ చైర్మన్ కే రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






## రసా బసగా మెగా పేరెంట్స్ మీటింగ్.

మధ్యాహ్నం భోజనం పథకంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం.



**పరవాడ పెన్ సత్తా, జులై 24:** అనకాపల్లి జిల్లా పరవాడ మండల కేంద్రం పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్ రస బసగా జరిగింది. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం పూట పెడుతున్న భోజనం బాగుండడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం సరిగా లేకపోవడంతో ఇంటి దగ్గర నుండే పిల్లలకు క్యారేజీలు పంపించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పాఠశాలలో తాగడానికి తగినంత నీరు అందుబాటులో ఉండడం లేదని దీంతో విద్యార్థులు తాగడానికి నీరు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అధ్యాపకుల ముందు సమస్యలను ఏకరవు పెట్టారు. బాలికలు నీరు లేక మరుగుదొడ్లకు వెళ్లలేకపోతున్నారని పేర్కొన్నారు. మరుగుదొడ్లు దుర్వాసనతో కంపు కొడుతున్నాయని, అపారిశుధ్యం కారణంగా తరచూ విష కీటకాలు పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా మెగా పేరెంట్స్ మీటింగ్ వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ఏడాది జరిగిన మెగా పేరెంట్స్ మీటింగు కి టెంటు, కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేశారని, ఈసారి తూతూ మంత్రంగా తరగతి గదిలో నిర్వహించారని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేదని పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మెగా పేరెంట్స్ మీటింగ్ కి విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులు ఎవరూ హాజరు కాకపోవడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల సిబ్బందిని నిలదీశారు. ఉన్నతాధికారులు హాజరు కాకపోతే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు లేవనెత్తున సమస్యల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

# జగన్ నెక్ట్స్ ప్లాన్

**విజయవాడ, జూలై 24**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ పెద్దల తలుపులు ఆయన కోసం ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన ఎప్పుడు దిల్లీ వెళ్లినా ప్రధాని, హోంమంత్రుల అపాయింట్‌మెంట్లు సులువుగా లభించేవి. కానీ, నేడు ఏపీలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయి ప్రతిపక్షానికి పరిమితమవ్వడమే కాకుండా, కేంద్రంలో ఏపీలోని కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు ఎన్డీఏ లో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ తరుణంలో జగన్ ఢిల్లీ మంత్రాంగం ఆయనకే రివర్స్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది తెలుగుదేశం, జనసేన, బీజేపీల సంయుక్త ఎన్డీఏ ప్రభుత్వం. ఒక రకంగా చెప్పాలంటే మోదీ, అమిత్ షాల నాయకత్వంలోని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు కీలక భాగస్వాములు. ఇలాంటి సమయంలో, రాష్ట్రంలో అధికార కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేయడానికి జగన్ వెళ్లి అదే ఎన్డీఏ పెద్దలను కలవాలని చూడటం రాజకీయంగా రివర్స్ అవుతుంది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన స్వంత కూటమి భాగస్వాములను పక్కనబెట్టి, ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీకి ప్రాధాన్యత ఇస్తుందని భావించడం వ్యూహాత్మక అపరిపక్వతే అవుతుంది. కూటమి ప్రభుత్వంపై మోదీ, షాలకు ఫిర్యాదు చేసినా, దానికి ప్రాధాన్యత లభించకపోగా.. జగన్ రాజకీయంగా మరింత రక్షణలో పడే ప్రమాదం ఉంది. జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీ పర్యటనలు, అపాయింట్‌మెంట్ల ప్రయత్నాలు జరిగిన ప్రతిసారీ ప్రజాక్షేత్రంలో ఒక్కటే బలమైన ప్రచారం జరుగుతుంది. అదేమిటంటే.. ఆయనపై ఉన్న సీబీఐ, ఈడీ అక్రమాస్తుల కేసులు, ఇతర విచారణల నుంచి ఉపశమనం పొందేందుకే ఆయన బీజేపీ పెద్దల చుట్టూ తిరుగుతున్నారనే భావన. గత ఐదేళ్ల పాటు పార్లమెంట్‌లో ఎన్డీఏకి అవసరమైన ప్రతి బిల్లుకూ ముందూ వెనుక ఆలోచించకుండా బేషరతుగా మద్దతు ప్రకటించిన జగన్, ఇప్పుడు కూడా బీజేపీ గుడ్ లుక్స్ లో ఉండేందుకే తాపత్రయపడుతున్నారని భావిస్తున్నారు. ఈ తరహా పర్యటనలు ఆయన ప్రతిపక్ష నాయకుడిగా సాధించే



ప్రజాదరణ కంటే, కేసుల భయంతోనే ఢిల్లీ పెద్దలకు నమస్కరిస్తున్నారు అనే ముద్రను మరింత బలపరుస్తాయి. ఒకపక్క రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, బీజేపీతో కలిసున్న చంద్రబాబు-పవన్ జోడీని తీవ్రస్థాయిలో విమర్శిస్తూ.. మరోపక్క అదే బీజేపీ అగ్రనేతల అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నాలు చేయడం వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయి క్యాడర్‌లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. పార్టీ శ్రేణులు రాష్ట్రంలో కూటమిపై పోరాడాలా లేక ఢిల్లీ స్థాయిలో సంధి ప్రయత్నాలు జరుగుతున్నాయని మౌనంగా ఉండాలా అనే సందిగ్ధంలో పడిపోతున్నాయి. ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడి బలం పుంజుకోవాల్సిన సమయంలో, అధినేత పదేపదే ఢిల్లీ పెద్దల ఆశీస్సుల కోసం చూడటం పార్టీ సైద్ధాంతిక స్టాండ్‌నే ప్రశ్నించేలా చేస్తోంది. ఈ భేటీలు ఒకవేళ సాధ్యమైనా, జగన్ రాజకీయంగా సాధించేది ఏమీ ఉండదనేది రాజకీయ విశ్లేషకుల స్పష్టమైన అంచనా. జగన్ ఇస్తే ఒకట్రెండు రాజ్యసభ ఓట్లు తప్ప, లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ బలం నామమాత్రంగా మారింది. అలాంటప్పుడు కేంద్ర పెద్దలు తమ కూటమి భాగస్వామి అయిన చంద్రబాబును కాదని జగన్‌కు రాజకీయ ప్రాధాన్యత లేదా ఊరట ఇస్తారనుకోవడం పొరపాటే. ఈ ప్రతిపాదన వల్ల కూటమి నేతలకు జగన్‌ను ఢిల్లీకి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడే నాయకుడు అని విమర్శించేందుకు అనువైన ఆయుధం దొరికినట్లవుతుంది. ఓ వైపు కేంద్రంపై వ్యతిరేకత పెరుగుతోందన్న

వాతావరణం ఏర్పడుతోంది. ఢిల్లీలో కాక్రోచ్‌ల ఉద్యమం ఓ రేంజ్‌కు చేరుకుంది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో వైఎస్సార్‌సీపీకి అత్యంత అవసరమైనది ప్రజల్లో ఉండటం, అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్రను పటిష్టంగా పోషించడం. ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడం వల్ల లేదా వినతిపత్రాలు ఇవ్వడం వల్ల వచ్చే పొలిటికల్ మైలేజ్ శూన్యం. దానికి బదులుగా, ఆ పర్యటనలు తెచ్చే రాజకీయ ప్రతికూలత, పక్షపాత ముద్రలు పార్టీకి మరింత నష్టాన్ని కలిగిస్తాయని ఎక్కువ మంది భావిస్తున్నారు. అయితే అపాయింట్మెంట్ లభిస్తే.. బయట ప్రచారం ఉన్నట్లుగా టీడీపీ కంటే ఎక్కువగా వైసీపీకే మోదీ ప్రాధాన్యం ఇస్తారని అనుకుంటారు. కానీ అది కూడా వైసీపీకి ఏ విధంగానూ మేలు చేయదు

# పుష్ప బ్రిడ్జిగా స్పెషల్ ఎట్రాక్షన్

సోషల్ మీడియా.. అదో నిరంతర ప్రవాహం. వింతల నుంచి విశేషాల వరకూ.. యుద్ధాల నుంచి సినిమాల వరకూ.. నిత్యం ఎన్నో పోస్టులు, వేలకొద్దీ వీడియోలు.. ఇక ఇందులో ప్రకృతి గురించి, ప్రకృతి అందాల గురించి ఎన్నో విశేషాలను షేర్ చేస్తుంటారు. అలా షేర్ చేసిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. చూడగానే వావ్ ఎక్కడిదీ స్పాట్ అని అనకుండా ఉండలేం.. దాని గురించి ఆరా తీసిన తర్వాత ఓసారైనా వెళ్లొద్దామని మనసు లాగడం ఖాయం. అలాంటిదే ఇప్పుడు చెప్పుకోబోయే బ్రిడ్జ్.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని మోతుగూడెంలో ఉంది ఈ వంతెన. మోతుగూడె ఫోర్‌బే డ్యామ్ బ్రిడ్జ అని పిలుస్తారు. లోయర్ సీలేరు హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ ప్రాజెక్టులో భాగంగా మోతుగూడెం ఫోర్‌బే డ్యామ్ నిర్మించారు. చుట్టూ
దట్టమైన అడవులు, కొండలు.. పచ్చదనం పరుచుకున్న వాతావరణం మధ్య ఉన్న ఈ డ్యామ్.. ప్రకృతి ప్రియులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఈ ప్రకృతి అందాలను చూసి సినిమా డైరెక్టర్లు కూడా ఇక్కడ షూటింగ్‌లు జరుపుతుంటారు. ఇక పుష్ప సినిమా షూటింగ్ తర్వాత.. మోతుగూడెం ఫోర్ బే డ్యామ్ బ్రిడ్జ్ కాస్తా..పుష్ప బ్రిడ్జ్‌గా పేరు తెచ్చుకుంది. పుష్ప సినిమాలోని కొన్ని సీన్లను ఇక్కడ చిత్రీకరించడంతో.. సినిమాతో పాటుగా ఈ ప్రాంతం కూడా బాగా పాపులర్ అయ్యింది. అప్పటి నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. చుట్టూ లక్కవరం అటవీ ప్రాంతం,

పచ్చని కొండల మధ్య సాగే మార్గం.. ఇక్కడ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తున్నాయి. ఇక కరెంట్ ఉత్పత్తి తర్వాత డొంకరాయి డ్యామ్ నుంచి పవర్ కెనాల్ ద్వారా నీరు ఈ డ్యామ్‌లోకి చేరుతుంది. ఆ సమయంలో ఈ డ్యామ్ మరింత అందాన్ని సంతరించుకుంటుంది. ఇక ఈ ఫోర్ బే డ్యామ్‌కు కొద్ది దూరంలో పొల్లూరు వాటర్ ఫాల్స్ ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి చూసేందుకు ఎక్కువమంది పర్యాటకులు వస్తుంటారు. అయితే నీటిని విడుదల చేసిన సమయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# అటు జక్కంపూడి... ఇటు భూమన

**విజయవాడ, జూలై 24**
వైసీపీ మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజ చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. ఒక దళిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) పై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారం ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర సంచలనంగా మారింది. సీఐ శేషయ్యను ఉద్దేశించి జక్కంపూడి రాజా అత్యంత అవమానకరమైన మరియు కుల దూషణలతో కూడిన వ్యాఖ్యలు చేశారంటూ పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై దళిత సంఘాలు మరియు పోలీస్ వర్గాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. కమిషన్ జారీ చేసిన కఠిన ఆదేశాల మేరకు పోలీసులు జక్కంపూడి రాజాపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. కొత్త చట్టం ప్రకారం బిఎన్ఎస్ 351(2) (BNS 351(2)) సెక్షన్‌తో పాటు అత్యంత కఠినమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఆయనపై నాన్-బెయిలబుల్ కేసులు నమోదు చేసి విచారణను వేగవంతం చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కర్నూలు పోలీసులు రాజమహేంద్రవరానికి చేరుకుని జక్కంపూడి రాజా నివాసంలో ఆయనకు అధికారికంగా నోటీసులు అందజేశారు. ఈ నెల 28వ తేదీన విచారణాధికారి ముందు స్వయంగా హాజరుకావాలని ఆ నోటీసుల్లో పోలీసులు స్పష్టం చేశారు. ఒక బాధ్యతాయుతమైన దళిత పోలీస్ అధికారిపై వైసీపీ సీనియర్ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. అయితే, ఆయనపై నమోదైన సెక్షన్లు ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందకు రావడం, పైగా నాన్-బెయిలబుల్ (జామీను లేని) నిబంధనలు ఉండటంతో జక్కంపూడి రాజాకు అరెస్ట్ గండం పొంచి ఉందని తెలుస్తోంది. ఈ నెల 28న జరిగే విచారణలో ఆయన సమాధానాలు సంతృప్తికరంగా లేకపోయినా, లేదా విచారణకు హాజరుకాకుండా ముఖం చాటేసినా పోలీసులు అతన్ని ఏ క్షణమైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. దీంతో ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో మరింత ఉత్కంఠ రేపుతోంది.

**తిరుపతిలో...**
తిరుపతి జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై కూటమి ప్రభుత్వం దర్యాప్తును తీవ్రతరం చేసింది. తిరుపతి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత భూమన కరుణాకర్‌రెడ్డి తిరుచానూరు పరిధిలోని స్వర్ణముఖి నది తీరంలో ఉన్న విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను ఆక్రమించారనే ఆరోపణలపై అధికార యంత్రాంగం నిశితంగా విచారణ జరుపుతోంది. నదీ గర్భాన్ని సైతం వదలకుండా పెద్ద ఎత్తున కబ్జాలకు పాల్పడ్డారనే ఫిర్యాదులపై మలిదశ దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. భూమన కరుణాకర్‌రెడ్డి అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని గతంలోనే న్యాయస్థానం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై జిల్లా కలెక్టర్ కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలోనే కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా అలసత్వం ప్రదర్శించిన ముగ్గురు రెవెన్యూ అధికారులకు (ఎమ్మార్వోలు) జిల్లా కలెక్టర్ అధికారికంగా ఛార్జ్ మెమోలు జారీ చేశారు. కలెక్టర్ నుంచి ఛార్జ్ మెమోలు అందుకున్న వారిలో గతంలో తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)గా పనిచేసిన రామానుజుల నాయక్, ప్రస్తుత తిరుపతి రూరల్ ఎమ్మార్వో జయంత్, అలాగే శ్రీకాళహస్తి ఎమ్మార్వో ఉన్నారు. భూకబ్జాల వ్యవహారంలో గత ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి ఉదాసీనంగా వ్యవహరించిన మరికొందరు అధికారుల జాబితాను కూడా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. తన ఆస్తులు ధ్వంసం చేసినా తాను వెనక్కి తగ్గబోనని..

ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం కొనసాగిస్తానని భూమన కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. దీంతో ఈ భూముల వివాదం ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర రాజకీయ మాటల యుద్ధానికి దారితీస్తోంది. భూముల యాజమాన్యం, రికార్డులు, ఆక్రమణల అంశాలపై రెవెన్యూ శాఖ విచారణ కొనసాగుతోంది. గత 21 ఏళ్లుగా ముఖ్యమంత్రులుగా రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్నప్పుడు ఈ భూములు కనిపించలేదా
అని భూమన కరుణాకర్ రెడ్డి ఏపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాను కూటమి ప్రభుత్వ విధానాలపై బలంగా గొంతు ఎత్తుతున్నందుకే ఈ కక్ష్య సాధింపు చర్యలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను మోసాలు, అవినీతి చేసినవాడ్ని కాదని తేల్చి చెప్పారు. తిరుపతిలో రౌడీ రాజకీయాలకు ఎన్నడూ అవకాశం లేదని.. తన జీవితం అంతా విలువలతో కూడిన రాజకీయాలు

చేశానని చెప్పుకొచ్చారు. 1991లో ప్రారంభించిన హెరిటేజ్ సంస్థ కూడా నది పోరంబోకు స్థలంలోనే ఉందని.. తన కుటుంబ ఆస్తులు దాడి చేయడం ద్వారా తనకు మరింత ఉత్సాహం వచ్చిందని.. ఇదే ఉత్సాహంతో కూటమి ప్రభుత్వ తప్పులను ప్రజల ముందు ఉంచుతానని హెచ్చరించారు. ఈ భూ అక్రమాలకు సహకరించిన మిగిలిన అధికారులపై సైతం త్వరలోనే కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

## 89 శాతం కూటమి వైపే ఉన్నారా....

**విజయవాడ, జూలై 24** : ఏపీలో తాజాగా మరోసారి ఐవీఆర్ ఎస్ సర్వే జరిగిందా? ప్రజల అభిప్రాయాలను మరోసారి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారా? వారి అభిప్రాయాలను దూసుకున్నారా? అంటే.. ఔననే అంటున్నారు టీడీపీ నాయకులు. పార్టీ పరంగా కాదు.. ఈ సారి కూడా సర్కారు పరంగానే సర్వే సాగిందని చెబుతున్నారు. పార్టీ వర్గాల కథనం మేరకు.. గత మే-జూన్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల మంది నుంచి ప్రభుత్వం ఫీడ్ బ్యాక్ తీసుకుంది. ప్రధానంగా ఇది సర్కారు విజయంపైనే సాగిందని చెబుతున్నారు. ూ మొత్తంగా 5 అంశాలపై ఈ దఫా ఐవీఆర్ ఎస్ సర్వే సాగిందని నాయకులు తెలిపారు. 1) ప్రభుత్వ సంక్షేమ పథకాలు: వీటిపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్న సర్కారు.. గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికంటే ఎక్కువగానే ఇస్తున్నారు. అలాగే.. అన్ని వర్గాలకు కూడా మేలు చేస్తున్నారు. 2) అన్న క్యాంటీన్లు: గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన దీనిని తాజాగా కొనసాగిస్తున్నారు. ఇది అనేక వేల మందికి మేలు చేస్తోంది. 3) పరిపాలన: క్షేత్రస్థాయిలో కార్యాలయాలకు వెళ్లే అవసరాన్ని దాదాపు తప్పిస్తూ..వాట్సాప్ పాలనను తీసుకువచ్చారు 4) గ్రామీణాభివృద్ధి: ప్రస్తుతం గత రెండేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో భారీ అభివృద్ధి జరిగింది. ప్రస్తుతం జరుగుతోంది కూడా. ఇలా.. ఈ నాలుగు అంశాలను సర్వేల్లో తీసుకున్నారు. నిజానికి ఇప్పటి వరకు ఎమ్మెల్యేల పనితీరు, స్థానిక నాయకుల పనితీరుపై సర్వేలు జరిగినా.. ఇంత విస్తృత స్థాయిలో ప్రభుత్వ పనితీరుపై సర్వే జరగడం ఇదే తొలిసారి అనేది నాయకులు చెబుతున్నారు. ఇక, చివరిగా.. 5వ అంశం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల స్పందన. ఇదే అత్యంత కీలకమని చెబుతున్నారు. దీనిపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించింది. వచ్చే ఎన్నికల్లో కూటమిగానే వెళ్లాలని కోరుకుంటున్న వారి సంఖ్య 89 శాతం వరకు ఉందని సర్వేలో స్పష్టమైంది. గత కొన్నాళ్లుగా ఇదే మాట ఇటు నాయకులు కూడా చెబుతున్నారు. కూటమిగా ఉంటేనే మేలు జరుగుతుందని అంటున్నారు. తాజాగా ప్రజల నుంచి కూడా అదే అభిప్రాయం వెల్లడి కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు మరింత జోరుగా కూటమి ఐక్యతనే తారకమంత్రంగా పఠించనున్నారు. పార్టీలలో ఎన్ని బేధాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. కూటమి ఐక్యతకే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సో.. మొత్తంగా ఇప్పటి కంటే కూడా.. కూటమి ఐక్యతకు ఇక నుంచి మరింత ఇంపార్టెన్స్‌తోపాటు.. మరింతగా కలివిడి తనానికి ప్రభుత్వం పరంగా కూడా ప్రాధాన్యం దక్కనుంది.

## 43 లక్షల మంది లిస్ట్ మిస్

**విజయవాడ, జూలై 24** : రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. అధికార కూటమి ప్రభుత్వం సర్ పై కుట్రలు చేస్తోందని, వైసీపీ సానుభూతిపరుల ఓట్లను లక్ష్యంగా చేసుకుని పెద్దఎత్తున ఓట్ల తొలగిస్తోందని ఆ పార్టీ ఆరోపణలు చేస్తోంది. ఈ మేరకు వైసీపీ అధికారిక ట్విటర్ ఖాతాలో పోస్టు పెట్టింది. ఓటు హక్కును కాలరాసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, బూత్ స్థాయి అధికారులను (బీఎల్వో) బెదిరించి ప్రతిపక్షానికి పట్టున్న జిల్లాల్లో ఉద్దేశపూర్వకంగానే ఓట్లను గల్లంతు చేస్తున్నారని వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలో 16.38 శాతం ఓట్లు తొలగించారని ఎత్తిచూపింది. రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియ మరో రెండు రోజుల్లో ముగియనుంది. నిజానికి 14వ తేదీనే సర్ సర్వే ముగియాల్సివుండగా, అధికార, విపక్షాల వినతి మేరకు దేశంలో ఎక్కడా లేని విధంగా పది రోజుల పాటు పొడిగించారు. అయితే మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుండగా, సర్ లో అక్రమాలు చోటుచేసుకున్నాయని వైసీపీ చేసిన ఆరోపణలు సంచలనంగా మారాయి. వైసీపీ మద్దతుదారుల ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయని వైసీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గడువు ముగిసేనాటికి రాష్ట్రంలో మరిన్ని ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని ఆ పార్టీ నాయకులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 43,62,387 ఓట్లు గల్లంతు అయినట్లు వైసీపీ ఆరోపించింది. మొత్తంగా 10.48 శాతం ఓటర్లను తొలగించడంపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఎక్కువ ఓట్లు గల్లంతు అయిన జిల్లాల్లో తిరుపతి జిల్లా ఏకంగా 16.38 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వైసీపీ వెల్లడించింది. ఈ జిల్లాలో తమ పార్టీకి ఎక్కువ బలం ఉండటంతోనే ఓట్లను భారీగా తొలగించారని ఆపార్టీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఇక రాష్ట్రంలోని మొత్తం 4.16 కోట్ల మంది ఓటర్లలో 14.87 లక్షల మంది చనిపోయిన వారి ఓట్లను గుర్తించి తొలగించినట్లు చెబుతుండగా, మరో 13.68 లక్షల మంది శాశ్వత వలసదారుల పేరుతో ఓట్లను తొలగించారని లెక్కలు విడుదల చేసింది.

## లింక్డిన్ లో వైజాగ్ టాప్

**విశాఖపట్టణం, జూలై 24** : ఆంధ్రప్రదేశ్‌లో లెక్కలు మారుతున్నాయి.. రాష్ట్రానికి కంపెనీల రాకతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా విశాఖపట్నానికి ఐటీ కంపెనీలతో పాటుగా డేటా సెంటర్లు, పరిశ్రమలు రావడంతో అక్కడ ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం టాప్‌లో నిలిచింది. మొన్నటి వరకు 3వ స్థానంలో ఉన్న విజయవాడ 10వ స్థానానికి పడిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ఫోకస్ పెట్టింది. జిల్లాల వారీగా పరిశ్రమలు, ఐటీ కంపెనీలను తీసుకొస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు వేగంగా పెరుగుతున్న నగరాల జాబితాలో ఏపీకి స్థానం దక్కింది. ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ సర్వీస్ లింక్డిన్ సిటీస్ ఆన్ ది రైజ్ పేరుతో విడుదల చేసిన సెకండ్ ఎడిషన్ జాబితాలో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. లుధియానా రెండో స్థానం, సూరత్ మూడో స్థానం, వడోదర నాలుగో స్థానం, ప్రయాగ్‌రాజ్ ఐదో స్థానం, రాజ్‌కోట్ ఆరో స్థానం, జబల్‌పూర్ ఏడో స్థానం, రాంచీ ఎనిమిదో స్థానం, రాయ్‌పూర్ తొమ్మిదో స్థానం, విజయవాడ పదో స్థానంలో నిలిచాయి. అయితే గతంలో మూడో స్థానంలో నిలిచిన విజయవాడ ఈసారి పదో స్థానానికి పడిపోయింది. లింక్డిన్ న్యూస్, డేటా సైంటిస్టులు రూపొందించిన ఈ ర్యాంకింగ్‌లకు సంబంధించి.. ఉద్యోగ అవకాశాలు, నియామకాలు, టాలెంట్ మైగ్రేషన్ పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న నగరాలను గుర్తిస్తున్నారు. మార్చి 2024 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో లక్షలాది లింక్డిన్ సభ్యుల ప్రొఫైల్‌లు, ఉద్యోగ ప్రకటనల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ రూపొందించారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్ట్, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ విస్తరణలతో సహా భారీ స్థాయి పెట్టుబడుల కారణంగా విశాఖపట్నానికి టాప్ ప్లేస్ దక్కింది. అంతేకాదు విశాఖపట్నంలో ఐటీ సేవలు, ఫార్మా, టెక్నాలజీ రంగాలలో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. వీటిలో డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, లారస్ ల్యాబ్స్, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ వంటి ప్రధాన సంస్థలు ఉన్నాయి. నగరంలోని ఉద్యోగాలలో 17.1 శాతం రిమోట్ పద్ధతిలో, 5.2 శాతం హైబ్రిడ్ పద్ధతిలో ఉన్నాయి. బలమైన జాబ్ మార్కెట్, ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉన్న నగరాలను లింక్డిన్ గుర్తించింది. 10 నాన్ మెట్రో నగరాలకు ర్యాంకులు కేటాయించగా.. ఇక్కడ ప్రతి పోస్టుకు దరఖాస్తుదారుల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉందని తేలింది.

# కూటమి పాలనలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- మెగా పేరెంట్ టీచర్ సమావేశం 4.0తో విద్యా వ్యవస్థ మరింత బలోపేతం
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు
- తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు మధ్య సమన్వయం పెంచే దిశగా చర్యలు
- విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడమే లక్ష్యం
- జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్







విద్యా రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశ్యంతో ఆమదాలవలస ఎమ్మెల్యే , రాష్ట్ర పి.యూ.సి చైర్మెన్ కూన రవికుమార్ ఆదేశాల మేరకు పొందూరు మండలం లోలుగు గ్రామంలో జెడ్పీ హై స్కూల్ లో మెగా పేరెంట్ టీచర్ సమావేశం 4.0 ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లోలుగు వెంకట్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు మధ్య మరింత సమన్వయం పెంచి విద్యా నాణ్యతను పెరుగుపరచడమే మెగా పేరెంట్ టీచర్ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్ అని బలంగా నమ్మిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతీ విద్యా సంస్కరణకు ప్రజలు అండగా నిలిచి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది కూటమి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్ధం కానీ జగన్ వ్యూహం

**కడప :** దేశవ్యాప్తంగా దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వర్సెస్ ఇండియా కూటమి ప్రతిపక్షాల నడుమ తీవ్రమైన రాజకీయ పొలరైజేషన్ నడుస్తోంది. నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం నుంచి పార్లమెంట్ నిరసనల వరకు ప్రతి అంశమూ కేంద్ర వర్సెస్ విపక్షాలుగా ప్రత్యక్ష రణరంగాన్ని తలపిస్తోంది. అయితే, దేశమంతటా ఈ స్థాయిలో రాజకీయ వేడి రగులుతుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం చిత్రమైన రాజకీయ నిశ్శబ్దం అలముకుంది. ఏపీలో కూడా ఎన్డీఏ శ్రేణుల పాలన నడుస్తుండటం, ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీ ఉండటంతో జాతీయ స్థాయి అంశాలపై ఇక్కడ కూడా రాజకీయ సెగ రావలసి ఉంది. కానీ, ఆ స్థాయి ప్రతిస్పందన ఏపీ రాజకీయాల్లో కనిపించకపోవడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.రాష్ట్రంలో విపక్ష హోదాలో ఉన్న కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో నీట్ బాధితులు, విద్యార్థుల పక్షాన నిరసన ప్రదర్శనలు చేపట్టినప్పటికీ, ఏపీలో ఆ పార్టీకి ఉన్న పరిమిత బలమైన కేడర్, ఓటు బ్యాంక్ దృష్ట్యా ఆ ఆందోళనలు అధికార పక్షంపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. నిజానికి, వైయస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఇది ఓ అరుదైన రాజకీయ అవకాశం. రాష్ట్రంలో లక్షలాది మంది నీట్ అభ్యర్థులు, యువత ఆందోళనలో ఉన్న వేళ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను నిలదీస్తూ గళమెత్తి ఉంటే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీకి మైలేజీ వచ్చి ఉండేది. కానీ, వైయస్సార్‌సీపీ ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా విద్యార్థి పోరాటంలోకి దూకలేకపోయింది.ఢిల్లీ వేదికగా కాంగ్రెస్ నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్షాల సమరానికి జగన్ మద్దతు ఇవ్వకపోవడం వెనుక ఆయన సొంత రాజకీయ సమీకరణలు ఉన్నప్పటికీ, కనీసం స్వతంత్రంగా విద్యార్థుల హక్కుల కోసమైనా గళం విప్పకపోవడం రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యపరిచింది. కాంగ్రెస్‌తో జట్టుకట్టడం ఇష్టం



లేకపోయినా, యువత బహుళ ప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై క్షేత్రస్థాయిలో తిరుగుబాటు జెండా ఎగరేసి ఉంటే వైయస్సార్‌సీపీ మళ్లీ జనామోదాన్ని పొందేందుకు అది నైతిక బలాన్ని ఇచ్చేది. కానీ, జగన్ ధైర్యంగా ముందుకు రాకపోవడం వల్ల ఏపీలో అధికార కూటమికి ఎలాంటి విపక్ష నిరసనల సెగ తగలకుండా సురక్షితంగా బయటపడే అవకాశం లభించింది. జాతీయ స్థాయిలో నడుస్తున్న ప్రతిపక్షాల వేవ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో వైయస్సార్‌సీపీ నాయకత్వం చూపుతున్న 'అతి జాగ్రత్త వైఖరి వెనుక బలమైన కారణాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంతో నేరుగా విభేదించడం వల్ల రాబోయే రోజుల్లో చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయనే భయాలు వైయస్సార్‌సీపీ వైఖరిని నియంత్రిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించేందుకు జగన్ యత్నించిన తీరు చూస్తే, ఆయన కేంద్ర అధికార పీఠంతో నేరుగా ఢీ కొట్టేందుకు అస్సలు సిద్ధంగా లేరని స్పష్టమవుతోంది.ఈ రక్షణాత్మక రాజకీయ ధోరణి వల్ల ప్రధానంగా నష్టపోతోంది వైయస్సార్‌సీపీ మాత్రమేనని చెబుతున్నారు. ఒక ప్రతిపక్షంగా ప్రజలు, యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వీధుల్లోకి వచ్చి పోరాడటంలో విఫలమైనప్పుడు, ఆ రాజకీయ ఖాళీని ఇతర శక్తులు పూరించే ప్రమాదం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం నుంచి పార్టీ కేడర్‌ను తిరిగి సమీకరించడానికి, కొత్త ఉత్సాహాన్ని నింపడానికి నీట్ వంటి జాతీయ అంశం ఒక అద్భుతమైన రాజకీయ అస్త్రంగా ఉపయోగపడి ఉండేది. కానీ, ఆ అవకాశాన్ని వైయస్సార్‌సీపీ చేజేతులా వదులుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతిపక్షం నుంచి గట్టి ప్రతిఘటన లేదా రాజకీయ నిరసనలు లేకపోవడంతో, కూటమి ప్రభుత్వం తమ పాలనాజెండాను చాలా సులువుగా అమలు చేయగలుగుతోంది. ఒకవైపు దేశమంతటా విపక్షాలు కేంద్రాన్ని కుదిపేస్తుంటే, ఏపీలో మాత్రం ఎన్డీఏ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ ఇబ్బందులు లేకుండా అత్యంత కంఫర్టబుల్ జోన్‌లో కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో వస్తున్న అవకాశాలను అందుకోవడంలో, ప్రజా సమస్యలపై అగ్రెసివ్ మైలేజీ సాధించడంలో వైఎస్ జగన్ అనుసరిస్తున్న ఈ వెనకడుగు వైఖరి వైయస్సార్‌సీపీ భవిష్యత్ రాజకీయాలకు ప్రతిబంధకంగా మారే అవకాశం ఉంది. ప్రతిపక్ష హోదాలో ఉంటూ కూడా కేంద్రంతో లేదా అధికార కూటమితో తలపడటానికి వెనుకాడటం వల్ల పార్టీ మద్దతుదారుల్లో తీవ్ర నిరాశ నెలకొంటోంది. రాబోయే రోజుల్లోనైనా జగన్ తన రాజకీయ శైలిని మార్చుకుని, ప్రజల్లో ఉండే సమస్యలపై పోరాట బాట పడతారా లేక ఇదే సైలెంట్ స్ట్రాటజీని కొనసాగిస్తారా అనేది చూడాల్సి ఉంది.

# గ్రేటర్ ఎన్నికలకు కోర్టు మోకాలడ్డూ

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాల్లో మునిగి తేలుతున్న అధికార కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ఉన్నత న్యాయస్థానం ఊహించని షాక్ ఇచ్చింది. జీహెచ్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించడంతో అధికార వర్గాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది. వార్డుల పునర్విభజన ప్రక్రియను చట్టబద్ధమైన నిబంధనల ప్రకారం పూర్తి చేసి, సరిహద్దులను శాస్త్రీయ పద్ధతిలో పునర్నిర్ణయించేంత వరకు ఎలాంటి ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవద్దని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ధర్మాసనం కఠినంగా ఆదేశించింది. రాజధాని నగరంపై పట్టు సాధించాలని భావిస్తున్న హస్తం పార్టీకి ఈ న్యాయపరమైన చిక్కు అతిపెద్ద రాజకీయ ఎదురుదెబ్బగా మారింది.ఈ వివాదానికి ప్రధాన మూలం ఇటీవల జీహెచ్ఎంసీ ఆదరాబాదరాగా చేపట్టిన వార్డుల విభజన ప్రక్రియలోని అవకతవకలే. మున్సిపల్ చట్టాల ప్రకారం ప్రతి వార్డు సరిహద్దు నిర్ణయం అనేది కేవలం ఆయా ప్రాంతాల జనాభా ప్రాతిపదికన, సమతుల్యత దెబ్బతినకుండా జరగాలి. కానీ, ప్రస్తుతం చేపట్టిన పునర్విభజన తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 లోని సెక్షన్ 6 స్ఫూర్తికి సంపూర్ణంగా విరుద్ధంగా ఉందంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఆధారాలు న్యాయస్థానాన్ని సంతృప్తిపరిచాయి. శాస్త్రీయ ప్రాతిపదికను పక్కనబెట్టి, కొన్ని ప్రాంతాలలో జనాభాను విపరీతంగా పెంచేసి, మరికొన్ని చోట్ల కుదించి వేయడం తీవ్రమైన అభ్యంతరాలకు దారితీసింది.ఈ పరిణామం వెనుక అధికార కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనం వెతుక్కునే ప్రయత్నం చేసిందనే ఆరోపణలు ఇప్పుడు గట్టిగా బలపడుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో సాంప్రదాయకంగా ప్రతిపక్షాలైన బీఆర్ ఎస్ , బీజేపీ , ఎంఐఎం బలంగా ఉన్న ఓటు బ్యాంకులను చెదరగొట్టేందుకే వార్డుల సరిహద్దులను తమకు అనుకూలంగా మార్చుకున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి వ్యక్తమయ్యాయి. కాంగ్రెస్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఓటర్లను, ప్రాంతాలను రాత్రికి రాత్రే అటు ఇటూ మార్చడం ద్వారా ఎన్నికల మేజిక్ చేయాలని చూశారన్న వాదనలకు కోర్టు బ్రేక్ ఇవ్వడంతో ప్రతిపక్షాలకు పెద్ద రాజకీయ ఆయుధం దొరికినట్లయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని ఉపయోగించి వార్డుల సరిహద్దులను మార్చడం కొత్తేమీ కాకపోయినా, చట్టపరమైన నిబంధనలను, నిబంధన పత్రాలను పూర్తిగా తొక్కిపట్టడం కాంగ్రెస్‌కు రివర్స్ కొట్టింది. ప్రజాభిప్రాయ సేకరణను మమ అనిపించి, శాస్త్రీయ సర్వేలు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని చూడటమే హైకోర్టులో ప్రభుత్వం ఇరుకున పడటానికి కారణమైంది. ఈ స్టే ఆర్డర్ పరిణామం ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు రాజకీయంగా పెద్ద ఊరటనిచ్చింది. కాంగ్రెస్ పార్టీ తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తోందని, గెలిచే అవకాశం లేకే అక్రమ మార్గాల్లో వార్డుల విభజన చేసింది అని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు వారికి చక్కటి అవకాశం లభించింది. హైకోర్టు




తీర్పును అడ్డం పెట్టుకుని, గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ వైఫల్యాలను, అక్రమ రాజకీయ వ్యూహాలను ఎండగట్టడానికి ప్రతిపక్షాలు సన్నాహాలు చేస్తున్నాయి. ఇది నగర పరిధిలో కాంగ్రెస్ గ్రాఫ్‌ను మరింత దెబ్బతీసే ప్రమాదం లేకపోలేదు.హైదరాబాద్‌ను రాజకీయంగా తమ గుప్పిట్లోకి తీసుకోవాలని వేసిన డెలిమిటేషన్ ఎత్తుగడ కాంగ్రెస్ మెడకే చుట్టుకుంది. ఇప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం మళ్లీ మొదటి నుంచి శాస్త్రీయంగా, పారదర్శకంగా సరిహద్దుల నిర్ణయం చేపట్టాలంటే నెలల సమయం పడుతుంది. ఆలోగా ప్రతిపక్షాల విమర్శల దాడిని తట్టుకోవడం, ప్రజా క్షేత్రంలో ఎదురయ్యే వ్యతిరేకతను అధిగమించడం కాంగ్రెస్ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

## ఘనంగా కుంటనహల్ పాఠశాల నందు మెగా పేరెంట్- టీచర్ 4. ఆత్మీయ సమావేశం....

:-ముఖ్య అతిథిగా బాధినేహల్ జిల్లా సహకారం సంఘ బ్యాంక్ చైర్మన్
:-పాఠశాలల దీటుగా ప్రభుత్వ పాఠశాలు...
:-విద్యార్థులకు సంక్షేమంతో పాటు విద్య వ్యవస్థలో అనేక ప్రమాణాలకు నాంది పలికాం..
:-నేడు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాభ్యాసంతో పాటు మంచి పౌష్టికాహారం అందిస్తుంది.



శుక్రవారం రోజున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యారంగంలో మార్పులకు మెగా పేరెంట్స్- టీచర్స్ 4.0 ఆత్మీయ సమావేశంలో కోసిగి బాలుర- బాలికల పాఠశాల నందు పాల్గొనడం జరిగినది. ఈ సందర్భంగా పాఠశాల నందు రాష్ట్ర గీతాలాపన అనంతరం విద్యార్థుల నిర్వహించిన నృత్యాలు అలకరించి,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతి చదువుకునే విద్యార్థికి ఆర్థిక సహాయం కింద15వేల రూ" అందిస్తున్న తీరు,విద్యారంగంలో విద్య శాఖ మంత్రి లోకేష్ తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులు,విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని డొక్కా సీతమ్మ పేరిట అందిస్తున్న మధ్యాహ్న భోజన మంచి ఆరోగ్యగా విద్యార్థులు ఉండాలని కోరడమైనది.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నంతగా ఎదగాలి

: రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్



విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చి సమాజానికి మంచి పేరు తీసుకురావాలని, చిన్న వయసులోనే మంచి నడవడిక, పట్టుదల అలవర్చుకోవడం విజయానికి బాటలు వేస్తుందని గుంతకల్లు రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ బాల ముని పాత కొత్తచెరువు జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల విద్యార్థులకు తెలిపారు. శుక్రవారం గుంతకల్లు మండలం పాతకొచ్చారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కు ముఖ్య అతిథిగా గుంతకల్లు రూరల్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్ ఐ బాలముని, ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు రవి మరియు తల్లిదండ్రులు హాజరైనారు. పాఠశాలలో విద్యార్థులు క్రమశిక్షణగా ఏ విధంగా ఉండాలి అని, మంచి సూచనలు పోలీస్ శాఖ వారు అందించడం జరిగింది. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు ఈ సమావేశం యొక్క ప్రాము ఖ్యతను విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించడం జరిగింది. సమావేశంలో వచ్చినటువంటి విద్యార్థి తల్లిదండ్రులకు పాఠశాలలో అమలవుతున్నటువంటి కార్యక్రమాలు వివరించడం జరిగింది. అదేవిధంగా తల్లిదండ్రులకి లీప్ ఏపిపి దీక్ష ఏపిపి గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల బృందం ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు బోధన బోధన సిబ్బంది ఇతర పాల్గొనడం జరిగింది.

## కూనవరం జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ 4.0 ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతుల వర్షం

పూర్వ విద్యార్థుల నుంచి పాఠశాలకు ప్రింటర్ విరాళం
500 కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



పోలవరం జిల్లా కూనవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమం శుక్రవారం ప్రధానోపాధ్యాయులు సిహెచ్. అప్పారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లల విద్యా పురోగతిని తరగతి ఉపాధ్యాయుల నుంచి తెలుసుకుని, వారి అభ్యాసంపై చర్చించారు. 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు స్వయంగా ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున నగదు బహుమతులు అందించారు. స్కూల్ కమిటీ చైర్మన్ ఒక్కొక్కరికి రూ.500, సిహెచ్. కాంతారావు రూ.5,000, విజయసాధన స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్ రూ.5,116, కే. సురేష్ రూ.3,000, కే. రవి రూ.2,000 నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.అలాగే 2005--06 విద్యా సంవత్సరపు పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు ఒక ప్రింటర్‌ను విరాళంగా అందించి తమ అనుబంధాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఎండీఎం సిబ్బంది, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పార్టీ మార్పు వార్తలపై మల్లారెడ్డి క్లారిటీ

**హైదరాబాద్ :** రాజకీయ వర్గాల్లో గత కొద్ది రోజులుగా తన పార్టీ మార్పుపై వస్తున్న ప్రచారానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి మల్లారెడ్డి చెక్ పెట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్న ఆయన, తాను బీఆర్ఎస్‌ను వీడి వేరే పార్టీలోకి వెళ్తున్నానంటూ వస్తున్న వార్తలన్నీ కేవలం నిరాధారమైన ప్రచారమేనని స్పష్టం చేశారు.తాను పార్టీ మారుతున్నాననే రూమర్లను నిజమని నమ్మి ఒక అభిమాని తన సొంత రక్తంతో లేఖ రాయడం తనను ఎంతగానో కలచివేసిందని మల్లారెడ్డి తెలిపారు. త్వరలోనే ఆ అభిమానిని నేరుగా కలిసి మాట్లాడతానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ... కేటీఆర్ 125 ఏళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కేటీఆరే ముఖ్యమంత్రి కాబోతున్నారని, ఆయన్ను సీఎం పీఠంపై చూడటమే తన ప్రధాన లక్ష్యమని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు.

## 85 జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి.ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు.

పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) ఫలితాలను సంక్షేమ పథకాలకు, కుల ధ్రువీకరణ పత్రాలకు ముడిపెడుతూ ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఓటరు జాబితానుంచి ఒక వ్యక్తి పేరు తొలగించడమంటే.. అతడు పౌరసత్వం కోల్పోయినట్టు కాదని, ఓటు హక్కుకు మాత్రమే అది పరిమితమని బిహార్ ఎస్ఐఆర్ కేసులో స్పష్టం చేసిన అంశాన్ని కోర్టు మరోసారి గుర్తుచేసింది. అయినప్పటికీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మే-జూన్ నెలల్లో జారీ చేసిన పలు ఉత్తర్వులు ఈ సూత్రాన్ని పూర్తిగా విస్మరించాయి. మే 19న జారీ అయిన ఒక నోటిఫికేషన్ ప్రకారం, ఓటరు జాబితా నుంచి పేరు తొలగివేయబడిన మహిళలు అప్పీలేట్ ట్రిబ్యునల్ ముందు అభ్యంతరం దాఖలు చేసుకోకపోతే, 'అన్నపూర్ణ యోజన' కింద అందే నగదు సాయానికి అనర్హులవుతారు. జూన్ 4న మరో ఉత్తర్వు ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) లబ్ధిదారుల జాబితానుంచి పేర్లు తొలగించాలని ఆదేశించారు. అంతకుముందు మే 14నే, ఓటరు జాబితాలో పేరు తొలగిన వారి కుల ధ్రువీకరణ పత్రాలను తిరిగి పరిశీలించి రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవానికి బిహార్ ఎస్ఐఆర్ తీర్పులో ఓటరు జాబితా ఫలితాలను ఓటు హక్కు నిర్ధారణ తప్ప మరే ప్రయోజనం కోసం వాడకూడదని కోర్టు కుండబద్దలు కొట్టినట్టు చెప్పింది. అయినా బెంగాల్ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో, ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు మరింత లోతుగా విచారణకు రావాల్సి ఉంది. ఇదే సందర్భంలో, మొహిబుల్లా మొండల్ అనే వ్యక్తి తన రేషన్ కార్డు రద్దును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన సందర్భంగా, ఓటరు జాబితా నుంచి తొలగినంత మాత్రాన కొన్ని సంక్షేమ ప్రయోజనాలకు అనర్హులు కారని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. అయితే ఆ నిర్దిష్ట పరిహారం కోసం కలకత్తా హైకోర్టును ఆశ్రయించమని ఆయనకు సూచించింది.

ఈ వివాదం వెనుక ఉన్న సంఖ్యలు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో సుమారు 34 లక్షలమంది తమ పేర్లు జాబితానుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ అప్పీళ్లు దాఖలు చేసుకున్నారు. అయితే వీటిలో కేవలం 38 వేల అప్పీళ్లు మాత్రమే ఇప్పటివరకూ పరిష్కారమయ్యాయి. ఈ అప్పీళ్లను విచారించేందుకు రాష్ట్రవ్యాప్తంగా కేవలం 19 ట్రిబ్యునళ్లు మాత్రమే ఉన్నాయి, వాటిలో ఇద్దరు న్యాయమూర్తులు ఇప్పటికే రాజీనామా చేశారు. ఈ లెక్కన మిగిలిన కోట్లాది అప్పీళ్లు ఎప్పటికి తేలుతాయో, అప్పటివరకూ ఆ కుటుంబాలు తిండి లేకుండా ఎలా బతకాలో అనే ప్రశ్నలకు సమాధానం లేదు! ఒక పరిపాలనా ప్రక్రియ ఆలస్యం కావడం సహజమే కావొచ్చు, కానీ ఆ ఆలస్యానికి శిక్షగా పేదలు ఆహార భద్రతను, జీవనాధార పథకాలను కోల్పోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. పౌరసత్వం, ఓటరు జాబితా మధ్య ఉన్న సంబంధం ఒక చిక్కుముడిలా

## పౌరపాట్లు! గ్రహపాట్లు!!

మారింది. ఓటరు జాబితాలో పౌరులు మాత్రమే నమోదవ్వాలనేది సూత్రం అయినప్పటికీ, జాబితాలో పేరు ఉండటమే పౌరసత్వానికి రుజువు కాదు. అదే సమయంలో, జాబితాలో నమోదుకాని పౌరులు కూడా దేశంలో లక్షలాదిగా ఉంటారన్నది సాధారణ లాజిక్కు తెలిసిన విషయమే. అంటే ఓటర్లుగా నమోదైన వారంతా పౌరులే అయినా, పౌరులంతా ఓటర్లుగా నమోదు కావాల్సిన అవసరం లేదు. ఇంత సూటిగా అర్థమయ్యే విషయాన్ని పక్కనపెట్టి, ఓటరు జాబితాలో పేరు లేకపోవడాన్ని జీవనాధార పథకాలకు, ముఖ్యంగా ఆహార భద్రతకు ముడిపెట్టడం అమానవీయమే కాక తర్కరహితం కూడా. న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చీ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ విషయంలో కీలకమైనవి. ఎన్నికల సంఘానికి పౌరసత్వాన్ని నిర్ధారించే రాజ్యాంగబద్ధ అధికారం లేదని, ట్రిబ్యునల్ ఒక వ్యక్తిని జాబితాలో చేర్చలేమని తేల్చిన తర్వాత, ఆ వ్యక్తి పౌరసత్వ నిర్ధారణ కోసం కేంద్ర హోంశాఖకు రిఫర్ చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని బిహార్


## సంపాదకీయం

ఎస్ఐఆర్ కేసులోనే స్పష్టం చేశామని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలు, ఓటరు జాబితా నుంచి తొలగింపు అనేది కేవలం ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక అంశమే తప్ప, అంతకుమించి పౌరుడి ఉనికినే ప్రశ్నార్థకం చేసే అంశం కాదని మరోసారి రుజువు చేస్తున్నాయి.

ఈ వివాదం కేవలం పశ్చిమ బెంగాల్‌కో, ఎస్ఐఆర్ ప్రక్రియకో పరిమితమైనది కాదు. పరిపాలనా యంత్రాంగం తన అధికార పరిధిని అతిక్రమించి, ఒక ప్రయోజనం కోసం రూపొందించిన డేటాను మరో అనవసర ప్రయోజనానికి వాడుకోవాలని చూసినప్పుడు తలెత్తే విస్తృత ప్రమాదాన్ని ఇది ఎత్తిచూపుతోంది. పౌరులకు, పౌరులు కాని వారికి కూడా వర్తించే సార్వత్రిక మానవ హక్కులు అనే భావన ఇక్కడ ప్రాధాన్యం సంతరించుకుంటుంది. కేవలం ఓటరు గుర్తింపు ఆధారంగా ఒక మనిషికి తిండి పెట్టాలా వద్దా అని నిర్ణయించడం ఏ నాగరిక సమాజానికీ తగినది కాదు.

పారదర్శకమైన ఓటరు జాబితాలు తయారు చేయడం, సంక్షేమ పథకాలను సరైన లబ్ధిదారులకు లక్ష్యంగా చేరవేయడం -ఈ రెండు లక్ష్యాలూ మంచి పాలనకు అవసరమైనవే. అయితే ఈ లక్ష్యాలను సాధించే క్రమంలో ప్రభుత్వాలు హేతుబద్ధతను, ఇంగితజ్ఞానాన్ని విడిచిపెట్టకూడదు. ఒక పరిపాలనా ప్రక్రియలో లోపాలు దొర్లడం సహజమే కావొచ్చు, కానీ ఆ లోపాల భారాన్ని అత్యంత బలహీనవర్గాల మీదికి నెట్టడం క్షమార్హం కాదు. సుప్రీంకోర్టు పదేపదే స్పష్టం చేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఉత్తర్వుల ద్వారా న్యాయస్థాన స్ఫూర్తిని బేఖాతరు చేయడం ఆందోళనకరం. వచ్చే విచారణలో సుప్రీంకోర్టు ఈ అంశంపై మరింత కఠినమైన వైఖరి తీసుకుని, పరిపాలనా యంత్రాంగానికి స్పష్టమైన హద్దులు నిర్దేశించాల్సిన అవసరం ఉంది. అంతిమంగా, ఓటరు జాబితాల సవరణ లక్ష్యం ఎన్నికల ప్రక్రియను పరిశుభ్రంగా ఉంచడమే తప్ప, పేదల నోటి కూటిని లాక్కోవడం కాదన్న విషయాన్ని ప్రభుత్వాలు మరచిపోకూడదు!

## పనికొచ్చే పలుకు



## పనిలో లీనమైతేనే విజయం వరిస్తుంది!

"చేసే పనిపై శ్రద్ధ పెట్టడమే నిజమైన విజయానికి మూలస్తంభం. పనిలో లీనమయ్యే వారికే సహజంగా అది లభిస్తుంది" అంటారు అమెరికన్ రచయిత, తత్వవేత్త హెన్రీ డేవిడ్ తోరో. ఆయన జీవితకాల అనుభవసారమిది. అమెరికన్ కవి, ప్రకృతి ప్రేమికుడైన తోరో ఆడంబరమైన నగర జీవనశైలిని వదిలిపెట్టి, వాల్డెన్ చెరువు ఒడ్డున ఒంటరిగా జీవించిన కాలంలో అన్వేషించిన సత్యమిది! ఇక్కడ -ఫలితాల గురించి పట్టించుకోవద్దని కాదు, సిసలైన విజయం ఎక్కడి నుంచి పుడుతుందో వివరించడమే ఆయన లక్ష్యం. చేసే పనిపట్ల అంకితభావమే, ఫలితాన్ని నిర్ణయిస్తుందన్నది ఆయన నమ్మిక.

వాస్తవానికి -విజయం వెంటపడితే.. అది దూరంగా పారిపోతుంది. ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను నిర్దేశించుకునే చాలామంది ఎదుర్కొనే విచిత్ర పరిస్థితి ఇది. గమ్యంపైనే నిరంతరం దృష్టి పెట్టినప్పుడు, ఆ గమ్యానికి చేర్చే పని దెబ్బతింటుంది. మనసంతా "ఎప్పుడు గెలుస్తానా" అనే ఆలోచనలతో నిండిపోతే, చేతిలో ఉన్న పనిపై పూర్తి ఏకాగ్రత సాధ్యం కాదు. నిజానికి మనం చేసే పనిలోనే విజయానికి పునాది పడుతుంది. ఏ కళాకారుడైనా, శాస్త్రవేత్త అయినా, రచయిత అయినా -వారు చరిత్రలో నిలిచిపోయిన ఘనతలు సాధించింది కీర్తి కోసం వెంపర్లాడి కాదు, తమ పనిపట్ల ఉన్న అపారమైన ప్రేమతోనే!

ఇక్కడ 'బిజీ' అంటే ఆధునిక కాలంలోలాగా అనవసరమైన పనులతో కాలయాపన చేయడం కాదు. చేసే పనిలో బాహ్య ప్రపంచాన్ని మరచిపోయేంతగా లీనమవ్వడం. నేటి సమాజంలో మనం ఎంత 'బిజీ'గా ఉన్నామో చూపించుకోవడమే ఒక పోటీగా మారిపోయింది. కానీ నిజమైన నిమగ్నత అంటే, గంటల లెక్క కాదు, మనసు లోతుల్లోకి పని చొచ్చుకుపోవడం. పని చేస్తూనే, ఇతరుల ప్రశంసల కోసం వెతుక్కునేవారి దృష్టి రెండుగా విడిపోతుంది. ఒక కన్ను పనిమీద, మరో కన్ను సమాజపు స్పందన మీద ఉంటుంది. ఈ విభజన వల్ల సృజనాత్మకత, పనిలో నాణ్యత తగ్గుతాయి. సోషల్ మీడియా యుగంలో ఇది మరింత స్పష్టం. -ప్రతి చిన్న ప్రయత్నాన్నీ ప్రపంచానికి చూపించాలనే తపనలో, అసలు పని విలువ తగ్గిపోతుంది. ఫలితం గురించి ఆలోచించకుండా శ్రమించినప్పుడు మాత్రమే, విజయం దానంతట అదే తలుపు తడుతుంది.

నేటి కాలంలో తోరో సూత్రాన్ని ఎలా పాటించాలి? మొదటిది, ఏకాగ్రతకు ప్రాధాన్యమివ్వాలి. పని చేసేటప్పుడు ఎంత సమయం కేటాయించామనే దానికంటే, ఎంత లీనమయ్యామనేది ముఖ్యం. నిరంతరం ఫలితాలను, ఇతరుల స్పందనలను చూసుకోవడం వల్ల దృష్టి చెదురుతుంది. రెండోది, ఇతరులను మెప్పించే ప్రయత్నం మానుకోవాలి. కేవలం విజయం కోసమే పని చేస్తే, అది ఇతరుల మెప్పు కోసం చేసే ప్రయత్నంగా మారిపోతుంది. అది మీ సహజమైన సృజనాత్మకతను దెబ్బతీస్తుంది. మూడోది, నిశ్శబ్ద శ్రమను నమ్మాలి. ప్రతిరోజూ చేసే ప్రామాణికమైన శ్రమ క్రమంగా పెద్ద ఫలితాలను ఇస్తుంది. వెంటనే ఫలితాలు కనిపించకపోయినా, పట్టుదలతో పని కొనసాగించడమే అసలైన క్రమశిక్షణ.

చివరిగా చెప్పాలంటే, జీవితంలో మనం సాధించే గొప్ప విజయాలు, మనం విజయం కోసం పరుగెత్తినప్పుడు రావు. మనం చేసే పనిలో మనల్ని మనం మర్చిపోయినప్పుడే వస్తాయి. తోరో చెప్పిన ఈ సూత్రం శతాబ్దాల క్రితం చెప్పినదైనా, నేటి పోటీ ప్రపంచంలో మరింత ఔచిత్యం సంతరించుకుంది.

# బర్న్‌హామ్ శకం మొదలైంది!

లేబర్ పార్టీ నేత ఆండీ బర్న్‌హామ్ బ్రిటన్ ఏడో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. పదేళ్లలో ఏడుగురు ప్రధానులు మారడం బ్రిటన్ రాజకీయ అస్థిరతకు అద్దం పడుతోంది. "మాంచెస్టరిజం" పేరుతో వికేంద్రీకరణ నమూనాను ఆయన ముందుకు తెస్తున్నారు. గృహ సంక్షోభం, పారిశ్రామికీకరణ లేమి వంటి సవాళ్లు ఆయన ముందు పెద్ద ప్రశ్నలుగా నిలుస్తున్నాయి. విధానాల్లో స్పష్టత కొరవడిందని పార్టీలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



బర్న్‌హామ్ శకం మొదలైంది.

బ్రిటన్‌కు పదేళ్లలో ఏడో ప్రధాని పదవి చేపట్టిన ఆండీ బర్న్‌హామ్, సోమవారం బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ చార్లెస్ మూడోను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి పొందిన అనంతరం అధికారికంగా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. లేబర్ పార్టీ నేతగా, గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్‌గా సుపరిచితుడైన బర్న్‌హామ్, జూన్ 22న కీర్ స్టార్మర్ తన పార్టీ ఎంపీల విశ్వాసం కోల్పోవడంతో ప్రధాని పదవికి, పార్టీ నాయకత్వానికి రాజీనామా ప్రకటించిన నేపథ్యంలో ఈ పీఠాన్ని అధిరోహించారు. లాంకషైర్‌లోని మేకర్‌ఫీల్డ్ నియోజకవర్గం నుంచి ఇటీవలే ఎంపీగా ఎన్నికైన బర్న్‌హామ్, పార్టీలోని 403మంది ఎంపీల్లో 379మంది మద్దతుతో ఏకైక అభ్యర్థిగా నిలిచి, ఎలాంటి పోటీ లేకుండానే నాయకత్వ బాధ్యతలు చేపట్టడం గమనార్హం. అధికార పార్టీ నాయకుడు మారడం, ప్రధాని మారడం బ్రిటన్‌లో ఈ మధ్యకాలంలో పరిపాటిగా మారిన అంశమే అయినా, రాజకీయ స్థిరత్వాన్ని కొత్త ప్రధాని వాగ్దానం చేయడం విశేషం. అయితే, ఆయన మీడియా ప్రశ్నలకు దూరంగా ఉండటం, తన విధానాలపై స్పష్టత ఇవ్వకపోవడం పలువురు విమర్శకులకు ఆందోళన కలిగిస్తోంది. లండన్‌కు రైలులో ప్రయాణించిన బర్న్‌హామ్, సాధారణ దుస్తుల్లోనే కనిపించినా, ప్రధానిగా బాధ్యతలు స్వీకరించే ముందు తగినట్టుగా దుస్తులు మార్చుకోవడం, ప్రతి చిన్న విషయంలోనూ ఆయన చూపిస్తున్న జాగ్రత్తను తెలియజేస్తోంది. "మాంచెస్టరిజం" పేరుతో తానే స్వయంగా రూపొందించిన రాజకీయ నమూనాను బర్న్‌హామ్ ముందుకు తీసుకెళ్తున్నారు. కేంద్రీకృత అధికారాన్ని, ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ప్రాంతీయ వికేంద్రీకరణ ద్వారా ప్రజలకు మరింత అధికారం కట్టబెట్టాలన్నది ఆయన ప్రధాన ఎజెండా.

బర్న్‌హామ్ రాజకీయ నేపథ్యం చూస్తే, ఆయనది సుదీర్ఘమైన, స్థిరమైన ప్రజాజీవితం. టోనీ బ్లెయిర్, గోర్డాన్ బ్రౌన్ ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసిన బర్న్‌హామ్, 2009-10లో ఆరోగ్య శాఖను నిర్వహించారు. ఆ తర్వాత గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా దాదాపు దశాబ్ద కాలం పనిచేసి, కోవిడ్-19 సంక్షోభ సమయంలో ఉత్తర ప్రాంత కమ్యూనిటీలకు మరింత ఫర్లో నిధులు కావాలని పోరాడి, "ఉత్తరాధిపతి"గా బ్రిటన్‌వ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. ఆ ప్రజాదరణ ఫలితంగానే 2021, 2024 ఎన్నికల్లో మళ్లీ మేయర్‌గా గెలుపొందారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినా, మాంచెస్టర్‌లోనే నివాసం కొనసాగిస్తానని, వారానికి కనీసం ఒక రోజు తన ఉత్తర ప్రాంత కార్యాలయం నుంచే పనిచేస్తానని ప్రకటించడం ఆయన ప్రాంతీయ నిబద్ధతకు నిదర్శనం. బర్న్‌హామ్ ముందున్న సవాళ్లు అత్యంత సంక్లిష్టమైనవి. బ్రిటన్‌లో ప్రస్తుతం 1.34 లక్షల కుటుంబాలు, అంటే 3.5 లక్షలమంది ప్రజలు తాత్కాలిక వసతుల్లో నివసిస్తుండగా, 13 లక్షల కుటుంబాలు గృహ వసతి కోసం నిరీక్షణ జాబితాల్లో ఉన్నాయి. హౌసింగ్ బెనిఫిట్ బిల్లు 36 బిలియన్ పౌండ్లకు చేరుకుంది. 1960వ దశకంలో ఏటా 4 లక్షల కౌన్సిల్ గృహాలు నిర్మించిన బ్రిటన్, 2025లో కేవలం 12 వేల గృహాలు మాత్రమే నిర్మించగలిగింది. యుద్ధానంతర కాలం నుంచీ అతిపెద్ద కౌన్సిల్ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడతానని బర్న్‌హామ్ ప్రకటించినా, నిధుల కొరత, నిర్మాణ రంగంలో కార్మికుల కొరత దృష్ట్యా ఆ లక్ష్యాన్ని సాధించడం అంత సులభం కాదు. నీరు, విద్యుత్తు, గృహ నిర్మాణం వంటి కీలక సేవలపై ప్రజా యాజమాన్యాన్ని పెంచడం, పారిశ్రామికీకరణను తిరిగి తీసుకురావడం, వెనుకబడిన పట్టణాలను పునరుజ్జీవింపజేయడం అనే మూడు లక్ష్యాలతో తన ఉత్తర ప్రాంత కార్యాలయాన్ని "పునర్నిర్మిత బ్రిటన్‌కు కేంద్ర నాడీ వ్యవస్థ"గా తీర్చిదిద్దుతానని ఆయన ప్రకటించారు.

అయితే ప్రతి నాయకుడిలానే బర్న్‌హామ్‌కు కూడా విమర్శకులు లేకపోలేదు. మితవాద పత్రికలు ఆయన ప్రణాళికలను "అహంకార పూరిత అర్థంలేని మాటలు"గా కొట్టిపారేస్తుండగా, పార్టీలోని కొందరు ఎంపీలు సైతం ఆయనను నామినేట్ చేయకుండా దూరంగా ఉన్నారు. ఆయన కీలక విధానాలు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయని, పార్లమెంటరీ లేబర్ పార్టీకి, దేశ ప్రజలకు మరింత స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఆయనపై ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. వికేంద్రీకరణ, ప్రాంతీయ స్వయంప్రతిపత్తి భావనలు ఆకర్షణీయంగా అనిపించినా, డీ ఇండస్ట్రియలైజేషన్, తక్కువ పెట్టుబడులు, ఉత్పాదకత లేమి, ఆరోగ్యం-విద్యారంగాల్లో సరిపడని సేవలు వంటి సమస్యలు దేశవ్యాప్తంగా అల్లుకుపోయిన అంశాలు. వీటిని కేవలం ప్రాంతీయ పరిష్కారాలతో అధిగమించడం సాధ్యం కాదు. బ్రెగ్జిట్ వంటి బృహత్తర నిర్ణయాలైనా, మాంచెస్టర్‌లో ద్వితీయ కార్యనిర్వాహక కేంద్రం ఏర్పాటు వంటి చిన్న చర్యలైనా, తక్షణ పరిష్కారాలు దీర్ఘకాలిక సమస్యలకు సమాధానం కావని చరిత్ర రుజువు చేసింది. జాతీయవాదం మాదిరిగానే ప్రాంతీయవాదం కూడా విభేదాలను, పక్షపాతాన్ని చట్టబద్ధం చేసే ప్రమాదం ఉందని, అంతర్జాతీయ సమాజంలో మాత్రమే కాక, కొందరు స్థానికులు ఇప్పుడు "విభజిత రాజ్యం"గా అభివర్ణిస్తున్న బ్రిటన్ లోపలే ఈ విభేదాలు తలెత్తుతున్నాయని గమనించాలి. అయితే షమీ చక్రబర్తికి 2008లో క్షమాపణ చెప్పిన సందర్భం వంటి ఉదంతాలు, బర్న్‌హామ్ మొండిపట్టుదల మనిషి కాదని, అవసరమైతే వెనక్కి తగ్గే సౌలభ్యం ఆయనలో ఉందని సూచిస్తున్నాయి. దక్షిణాసియా మూలాలున్న పలువురు నేతలు ఆయన తొలి లండన్ ప్రసంగంలో ప్రముఖంగా కనిపించడం కూడా ఆయన సమ్మిళిత దృక్పథానికి నిదర్శనం. చివరకు, నిర్ణయాలు మాంచెస్టర్‌లో తీసుకున్నా, డౌనింగ్ స్ట్రీట్‌లో తీసుకున్నా, ఓటర్లు కోరుకుంటున్న మార్పును అవి నిజంగా అందించగలిగితేనే వాటికి అర్థం ఉంటుంది. "ఇది కేవలం మాంచెస్టర్‌కే కాదు, దేశ రాజకీయాలకే కొత్త శకం" అని బర్న్‌హామ్ చేసిన ప్రకటన ఆశావహంగా ఉన్నా, దాని నిజమైన పరీక్ష రాబోయే రోజుల్లో ఆయన అమలుపరిచే విధానాల్లోనే తేలనుంది. ■



ఒంటరితనం ఒబెసిటీ కంటే తక్కువేమీ కాదు, అంతే ప్రమాదకరం. మంచి స్నేహ బంధాలు కలిగినవారిలో అకాల మరణాల ముప్పు దాదాపు 50 శాతం తగ్గుతుందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం కంటే కూడా బలమైన స్నేహాలు మనిషి ఆయుష్షను పెంచడంలో మరింత శక్తిమంతంగా పనిచేస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. కేవలం శారీరక ఆరోగ్యమే కాదు, మానసిక ఆరోగ్యానికీ స్నేహితులు ఎంతో అవసరం. అందుకే బిజీ జీవితంలోనూ మంచి స్నేహితులతో బంధాలను కాపాడుకోవడం మర్చిపోకూడదు.

-మహాదేవ

## వింతల్లో వింతలు

## టాయిలెట్ పోటీ వైరల్




రష్యాలోని స్టావ్రోపోల్ నగరంలో ఓ ప్లంబింగ్ కంపెనీ నిర్వహించిన వింత పోటీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. "గేమ్ ఆఫ్ థ్రోన్స్" పేరుతో నిర్వహించిన పోటీలో, పాల్గొన్నవారు కొత్త టాయిలెట్ సీట్ల మీద పెద్ద స్ట్రాలతో నాన్-ఆల్కహాలిక్ డ్రింక్‌ను తాగాల్సి వచ్చింది. వేగంగా తాగినవారు తర్వాతి రౌండ్‌కు అర్హత సాధించారు. తుది రౌండ్‌లో, పాల్గొన్నవారు మూసిన టాయిలెట్ సీటుపై ఎంతసేపు కూర్చోగలరో చూసేందుకు పోటీపడ్డారు. చివరి వరకూ నిలిచినవారు విజేతగా నిలిచారు. విజేతకు లక్ష రూబుళ్లు (దాదాపు రూ. 1,100) బహుమతిగా ప్రకటించారు. పది గంటలపాటు సాగిన పోటీలో కేవలం ఇద్దరు మాత్రమే మధ్యలో వైదొలిగారు. అయితే నిర్వాహకులు పరిశుభ్రతను పాటించామని చెప్పినా, ఈ పోటీ అభ్యంతరకరంగా ఉందని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు.

# మలిక్ త్రుటిలో..

## పతకం చేజార్చుకున్న పారా పవర్ లిఫ్టర్

### ఇంగ్లాండ్‌కు తొలి స్వర్ణం



గ్లాస్గో: కామన్వెల్త్ గేమ్స్ రెండో రోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. కచ్చితంగా పతకం సాధిస్తాడనుకున్న పారాపవర్‌లిఫ్టర్ అశోక్ మలిక్ నిరాశపరిచాడు. పురుషుల లైట్‌వెయిట్ విభాగంలో అతడు 143.8 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో పతకం చేజార్చుకున్నాడు. మరో అథ్లెట్ పరమ్‌జీత్ (135.6) ఏడో స్థానంతో ముగించాడు. ఈసారి క్రీడల తొలి పతకం ఇదే విభాగంలో తేలడం విశేషం. ఇంగ్లాండ్‌కు చెందిన మార్క్ స్వాన్ (153.9, ఇంగ్లాండ్) తొలి స్వర్ణం సొంతం చేసుకున్నాడు. రోలాండ్ ఎజురుకె (153.9, నైజీరియా) రజతం, బానీ గస్టిన్ (153.5, మలేసియా) కాంస్యం గెలిచారు. పవర్ లిఫ్టింగ్ మహిళల లైట్‌వెయిట్ విభాగంలో భారత మహిళలు విఫలమయ్యారు. జస్‌ప్రీత్ కౌర్ (96.4 పాయింట్లు) ఆరు, సుమన్ దేవి (88.4) ఏడో స్థానాలకు పరిమితమయ్యారు. నైజీరియా లిఫ్టర్ ఎస్తర్ నొవార్గు (119.0) పసిడి చేజిక్కించుకోగా.. అదే దేశానికి చెందిన ఎస్తర్ ఒయేమా (115.5) రజతం సాధించింది. ఒలివియా బ్రూమ్ (106.6, ఇంగ్లాండ్) కాంస్యం గెలిచింది.

**ఫైనల్లో బుదిగిన, అలీ..:** పారాస్విమ్మింగ్ 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 (దృష్టిలోపం ఉన్న అథ్లెట్లు) ఈవెంట్లో బుదిగిన, ఇమాం అలీ ఫైనల్లోకి ప్రవేశించారు. బుదిగిన 57.10 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని మూడో స్థానంలో నిలిచాడు. అలీ (1:05.32 సె) ఆఖరి స్థానంలో నిలిచినప్పటికీ మెరుగైన సమయం నమోదు చేసిన అతడు ఫైనల్‌కు అర్హత సాధించాడు.

**లాన్ బౌల్స్‌లో వరుసగా రెండో విజయం..:** లాన్ బౌల్స్ మహిళల పెయిర్స్ ఈవెంట్లో రూపరాణి టిర్కీ, పింకి సింగ్‌ల జంట ఆకట్టుకుంటోంది. ఈ జోడీ వరుసగా రెండో విజయం నమోదు చేసింది. రూప, పింకి ద్వయం 2-0తో తబెలో ముహాంగో, వాన్ రెన్స్‌బర్గ (దక్షిణాఫ్రికా) జోడీని ఓడించింది. ఆరంభం నుంచి రాణించిన భారత జంట 6-4తో తొలి సెట్‌ను దక్కించుకుంది. తర్వాత కూడా జోరు కొనసాగించి 7-5తో సెట్ గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. తొలి మ్యాచ్‌లో రూప జోడీ టైబ్రేక్‌లో మాల్టాపై నెగ్గిన సంగతి తెలిసిందే. లాన్ బౌల్స్ పురుషుల సింగిల్స్‌లో పుతుల్ సోనోవాల్ రెండో మ్యాచ్‌లో విజయం సాధించాడు. సెసిల్ అలెగ్జాండర్‌పై టైబ్రేక్‌లో గెలిచాడు. సోనోవాల్ 7-5తో తొలి సెట్ దక్కించుకోగా.. రెండో సెట్‌ను 6-8తో ప్రత్యర్థికి కోల్పోయాడు. అద్భుతంగా రాణించిన సోనోవాల్ టైబ్రేక్‌లో సెసిల్‌పై పైచేయి సాధించాడు.

**సెమీస్‌లో శ్రీహరి..:** 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్లో శ్రీహరి నటరాజ్ సెమీస్‌లో అడుగుపెట్టాడు. 25.52 సెకన్లలో ఈత పూర్తి చేసి 8 మంది అథ్లెట్లు పోటీపడ్డ హీట్‌లో అయిదో స్థానంతో సెమీస్ చేరాడు.

**ప్రిక్వార్టర్స్‌లో జాదుమణి..:** పురుషుల బాక్సింగ్‌లో జాదుమణి సింగ్ సత్తాచాటాడు. 55కేజీల విభాగంలో అతడు 5-0తో ఆరోన్ కలెన్ (స్కాట్లాండ్)ను మట్టి కరిపించి ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించాడు.

**కామన్వెల్త్ గేమ్స్‌లో ఈనాడు భారత అథ్లెట్ల పతకాంశాలు**

జిమ్నాస్టిక్స్: మ. 2:30కి: మహిళల టీమ్, వ్యక్తిగత రౌండ్లు – ప్రణతి నాయక్, ప్రతిష్ఠ సమాంత, ఇషితా రెవలె, నిష్క అగర్వాల్, రిద్ధి శర్మ.

స్విమ్మింగ్: సా.4కు 400 మీ. ఫ్రీస్టైల్ హీట్స్- దక్షణ్ శశికుమార్, ఆర్యన్ నేహ్రా; పురుషుల 50 మీ. బ్యాక్‌స్ట్రోక్ – శ్రీహరి నటరాజ్

# జోరు కొనసాగిస్తారా?

### జింబాబ్వేతో భారత్ రెండో టీ20 నేడు

### సాయంత్రం 4.30 నుంచి యునైట్8 స్పోర్ట్స్, డీడీ స్పోర్ట్స్‌లో

**వరుస పరాభవాలతో తల్లడిల్లిన టీమ్‌ఇండియాకు జింబాబ్వేతో తొలి టీ20లో విజయం గొప్ప ఊరటే. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో తొలిసారి గెలిచిన జట్టు.. జోరు కొనసాగించాలనే పట్టుదలతో మరో సమరానికి సిద్ధమైంది. జింబాబ్వేతో రెండో టీ20 నేడే. బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.**




హరారె: కోలుకునే బాటలో ఉన్న టీమ్‌ఇండియా.. శనివారం రెండో టీ20లో ఆతిథ్య జింబాబ్వేను ఢీకొంటుంది. 0-2తో ఐర్లాండ్‌కు, 0-4తో ఇంగ్లాండ్‌కు సిరీస్‌లు కోల్పోయిన భారత్.. జింబాబ్వేతో సిరీస్‌ను ఘనంగా ఆరంభించిన సంగతి తెలిసిందే. వైభవ్ సూర్యవంశీ మెరుపు బ్యాటింగ్, మయాంక్ యాదవ్ పదునైన పేస్‌తో 7 వికెట్ల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. పెద్దగా పోటీ ఎదురుకాలేదు. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్ చేజిక్కించుకోవాలనుకుంటున్న టీమ్‌ఇండియాను అడ్డుకోవడం జింబాబ్వేకు పెద్ద సవాలే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలో ఉంది.

**ఉత్సాహంగా భారత్:** తొలి మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన భారత జట్టు ఈ మ్యాచ్‌కు ఉత్సాహంగా సిద్ధమైంది. కుర్ర ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ జోరందుకోవడం ఆ జట్టుకు గొప్ప సానుకూలాంశమే. ఎడాపెడా ఫోర్లు, సిక్స్‌లతో విరుచుకుపడ్డ వైభవ్.. అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత పిన్నవయసులో అర్ధశతకం (18 బంతుల్లో) సాధించిన బ్యాటర్‌గా ఘనత సాధించిన తెలిసిందే. అతణ్ని ఆపడం జింబాబ్వే బౌలర్లకు కష్టమైన పనే. తొలి మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ (35), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (28 నాటౌట్) కూడా రాణించారు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ మాత్రం ఇబ్బంది పడ్డాడు. 8 బంతుల్లో ఒక్క పరుగు మాత్రమే చేసి వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో అతడు పుంజుకుంటాడని జట్టు ఆశిస్తోంది. అయితే తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ కన్నా యువ పేస్ బౌలర్లు సమష్టిగా రాణించడమే భారత జట్టుకు సంతోషాన్నిచ్చి ఉంటుంది. ప్రిన్స్ యాదవ్ (2/29) మెరుగైన ప్రదర్శన చేశాడు. అరంగేట్ర బౌలర్ అశోక్ శర్మ వికెట్లు తీయకపోయినా.. మంచి పేస్‌తో బౌలింగ్ చేశాడు. హైలైట్ మాత్రం మయాంక్ యాదవ్ బౌలింగే. నిలకడగా 145 కి.మీ కి మించిన వేగంతో బంతులేసిన అతడు.. జింబాబ్వే బ్యాటర్లను హడలెత్తించాడు. 18 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టిన మయాంక్.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. పేసర్లు మరోసారి సత్తా చాటాలని భారత జట్టు మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. ఈ మ్యాచ్‌కు తుది జట్టులో ఎలాంటి మార్పులు చేసే అవకాశం లేదు. శివమ్ దూబె మరోసారి అయిదో బౌలర్ బాధ్యత తీసుకుంటాడు. ఏకైక స్పిన్నర్‌గా రవి బిష్ణోయ్ జట్టులో ఉంటాడు.

**జింబాబ్వేకు సవాలే:** బలమైన భారత్‌ను నిలువరించడం జింబాబ్వేకు కష్టమైన పనే. కానీ తొలి మ్యాచ్‌లో ఆ జట్టుకు కొన్ని సానుకూలాంశాలు కూడా ఉన్నాయి. అనుకూలించే పరిస్థితుల్లో ఫాస్ట్‌బౌలర్ ముజరబాని చక్కగా బౌలింగ్ చేశాడు. ముఖ్యంగా తన తొలి రెండు ఓవర్లలో బ్యాటర్లకు ఏమాత్రం స్వేచ్ఛనివ్వని అతడు.. అభిషేక్ శర్మను ఔట్ చేశాడు. ప్రధానంగా బ్యాటింగ్ వైఫల్యం జింబాబ్వేను దెబ్బతీసింది. కానీ 32 పరుగులకే 4 వికెట్లు కోల్పోయినా.. 125 చేయగలిగింది. వికెట్‌కీపర్ బ్యాటర్ మరుమని ఫామ్‌లో ఉన్నాడు. మరి ఈ మ్యాచ్‌లో అతడు, మిగతా బ్యాటర్లు భారత బౌలర్లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

**తుది జట్లు (అంచనా)**

భారత్: అభిషేక్, వైభవ్, ఇషాన్ కిషన్, శ్రేయస్, తిలక్ వర్మ, దూబె, రింకు, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అశోక్ శర్మ.

జింబాబ్వే: బెనెట్, బెన్ కరన్, మయర్స్, సికందర్ రజా, ర్యాన్ బర్ల్, మధెవెరె, మరుమని, బ్రాడ్ ఎవాన్స్, మసకద్జ, ముజరబాని, ఎంగరవ.

**పిచ్ ఎలా ఉందంటే..**

తొలి మ్యాచ్‌కు వేదికైన హరారె స్పోర్ట్స్ క్లబ్‌లోనే రెండో టీ20 కూడా జరగనుంది. మొదటి మ్యాచ్‌లో ఫాస్ట్‌బౌలర్లకు మంచి సహకారం లభించింది. శనివారం కూడా అదే పరిస్థితి ఉండొచ్చు. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.




# స్పిరిట్ క్రేజీ అప్ డేట్ ఏంటంటే?




పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ – సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా -స్పిరిట్- తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో? చెప్పాల్సిన పనిలేదు. దీంతో సినిమా ఎప్పుడెప్పుడు? ప్రేక్షకుల ముందుకొస్తుందని ఆసక్తి అంతకంతకు పెరిగిపోతుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ చిత్రం గురించి ఓ క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ 40 శాతం పూర్తయిందని సందీప్ రెడ్డి వంగా వెల్లడించారు. ఈ సినిమా షూటింగ్ ప్రక్రియ ఇప్పటికే వేగంగా కొనసాగుతోందని.. సినిమాలోని కీలకమైన సన్నివేశాలను, యాక్షన్ ఘట్టాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు. 40 శాతం షూటింగ్ పూర్తి కావడం అంటే? నిర్మాణ బృందం పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తోందనడానికి నిదర్శనం. ప్రభాస్ లుక్ ..క్యారెక్టరైజేషన్ విషయంలో సందీప్ తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారని రోజులుగా ప్రచారం జరుగుతోంది. సాధారణంగా సందీప్ సినిమాల్లో హీరోల పాత్రలు చాలా ఇంటెన్స్‌గా, ఎమోషనల్‌గా ఉంటాయి. ప్రభాస్ వంటి మాస్ ఇమేజ్ ఉన్న నటుడు ఎలాంటి పాత్రలో ఎలా కనిపించబోతున్నాడనేది ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగిస్తోంది.

ఇప్పటికే పూర్తయిన 40 శాతం షూటింగ్‌లో ప్రభాస్ నటించిన సీన్లు చాలా పవర్‌ఫుల్‌గా వచ్చాయని చిత్ర వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. సాంకేతికపరంగా స్పిరిట్ హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో రూపొందుతోందని తెలుస్తోంది. భారీ సెట్లు, అత్యాధునిక కెమెరా పనితనం , నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలవనున్నాయి. సందీప్ రెడ్డి వంగా ప్రతి సినిమాకు సంగీత దర్శకులతో ప్రత్యేకమైన శబ్దాలను రూపొందిస్తారు. ఈ చిత్రానికి కూడా ఆయన మ్యూజిక్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన భాగం షూటింగ్ కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు చిత్ర బృందం సిద్ధమైంది. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన నాటి నుంచి ఇండియాలోనే వివిధ లోకేషన్లలో జరుగుతోంది. విదేశీ లోకేషన్ల వరకూ వెళ్లలేదు. ఈ నేపథ్యంలో 60 శాతం షూటింగ్ లో కొంత భాగం విదేశాల్లో జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సాధారణంగా సందీప్ విదేశీ షూటింగ్ లకు పెద్దగా ప్రాధాన్యతనివ్వరు. వీలైనంత వరకూ ఇండియాలోనే చుట్టేస్తారు. -అర్జున్ రెడ్డి-, -యానిమల్- షూటింగ్ లు ఇండియాలోనే జరిగాయి. వాటిలో పాటలకు కూడా పెద్దగా ప్రాధాన్యత లేదు కాబట్టి విదేశీ లోకేషన్ల అవసరం పడలేదు. మరి -స్పిరిట్- విషయంలో విదేశీ లోకేషన్ల ఛాన్స్ ఎంత వరకూ తీసుకుంటారు? అన్నది తేలాల్సి ఉంది.





PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com